ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 16 సెప్టెంబరు 2025





కలెక్టర్ల సదస్సుకు హాజరైన జిల్లా నూతన కలెక్టర్ తమిమ్ అన్సారియా

గ్రామ సింహం.. ప్రాణ సంకటం!

వీధి కుక్కల దాడితో ప్రాణం విడిచిన నాలుగున్నరేళ్ల చిన్నారి

విషాద మరణం సంధిస్తున్న ప్రశ్నలెన్నో..

గ్రామీణ ప్రాంతాల్లో అధికమైన వీధి కుక్కల బెడద

పొన్నూరుటౌన్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో మరో చిన్నారి ప్రాణం విడిచింది. రేబిస్ బారిన పడి పక్షం రోజులు ఆసుపత్రిలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతూ.. విషాదంగా కన్నుమూసింది. కన్న తల్లిదండ్రులకు తీవ్ర వేదనను మిగిల్చింది. పొన్నూరు మండలం వెల్లలూరులోని నాలుగున్నరేళ్ల చిన్నారి తాడిశెట్టి కార్తీక్ మరణం.. వీధి కుక్కల నియంత్రణలో స్థానిక సంస్థల పాలకులు, అధికారుల పనితీరును మరోసారి ప్రశ్నించింది. వారి నిర్లక్ష్యాన్ని నిలదీస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద నియంత్రణలో.. తీసుకుంటున్న చర్యలపై ఆందోళనను మరింత తీవ్రం చేసింది. ఇప్పటికైనా.. అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు వేడుకొనేలా చేస్తోంది.

ఏ గ్రామం వెళ్లినా..

గ్రామాల్లో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. మండల పరిధిలోని ఏ గ్రామానికి వెళ్లినా.. మూకుమ్మడిగా సంచరిస్తూ దాడులు చేస్తున్నాయి. గ్రామాల్లో నియంత్రణ వ్యవస్థ లేకపోవడంతో.. వీధి కుక్కల బెడద అధికమైంది. అయితే ఈ కుక్కలన్నీ స్థానికంగా ఉన్నవి కావని.. పట్టణాల్లో పట్టి తెచ్చి గ్రామాల్లో విడిచి



పెడుతున్నారని పల్లె ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రిళ్ల ప్రయాణించే ద్విచక్ర వాహనాల వెంటపడుతున్నాయి. దీంతో ఒక్కసారిగా హడలిన వాహనదారులు పట్టు తప్పి పడిపోయి తీవ్రంగా గాయపడుతున్నారు. మరి కొందరి కాళ్లను నోట కరిచి.. గాయపరుస్తున్నాయి. వీధి కుక్కల బెడదను నియంత్రించాల్సిన పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని.. పలు గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు కనీసం ప్రయత్నం చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంలో సుప్రీం మార్గదర్శకాలు శూన్యం..

గతంలో వీధి కుక్కల నియంత్రణపై జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు పోరాటాలు చేయడంతో.. అధికారులు ఉదాసీనత అవలంబించేవారు. అయితే తాజాగా దేశ సర్వోన్నత న్యాయస్థానం కుక్కల నియంత్రణకు స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. హాని కలిగించే కుక్కలను సంహరించకుండా.. నియంత్రణ చర్యలకు అనేక సూచనలు చేసింది. ప్రధానంగా చిన్నారులు ఎక్కువగా సంచరించే పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల వద్ద కుక్కలను గుర్తించి.. వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలని ఆదేశాలు జారీ చేసింది. రేబిస్ బారిన పడకుండా టీకా వేయాలని స్పష్టం చేసింది. వీధి కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలని, అవి ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పెట్టడకూడదని నిషేధించింది. పిల్లల సంరక్షణకు, శునకాల రక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక సంస్థలు ప్రభుత్వానికి సమాచారం అందించాలని ఆదేశించింది. దాడి చేసే స్వభావం కల కుక్కలను పట్టుకుని సంరక్షణ కేంద్రాలకు తరలించాలని, మాంసం వ్యర్థాలు, ఆహార పదార్థాలను రహదారులు, వీధుల వెంట పడవేయకుండా చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే శునకాల దాడుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని.. గ్రామ, మండల, పురపాలిక వర్గాలు, అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలకు పరిష్కారం చూపేలా చర్యలు ఉండాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాలు నేటి వరకు క్షేత్రస్థాయిలో అమలు చేయడం లేదు. స్థానిక సంస్థల అధికార యంత్రాంగం వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటే తప్పా.. ఈ సమస్యకు పరిష్కారం లభించేట్లు లేదని ప్రజలు వాపోతున్నారు.



తుమ్మ కంపలతో నిండిపోయిన కృష్ణాయపాలెం లే అవుట్

కూలిపోయిన గత సీఎం ఆవిష్కరించిన జగనన్న ఇళ్ల పైలాన్

ఆర్-5 జోన్‌పై మీనమేషాలు!?

రాజధాని రైతులపై ఆరని మంటలు రేపిన ఆర్- 5 జోన్ కుంపటి రెండున్నరేళ్లుగా మండుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఇప్పటికి పదిహేను నెలలు అవుతున్నా ఆ వ్యవహారం అలానే ఉండడం రాజధాని రైతుల్లో ఒకింత ఆందోళన కలిగిస్తోంది. మాస్టర్‌ప్లాన్‌లో అత్యంత కీలకమైన ప్రాంతాలను దెబ్బతీసేలా గత వైసీపీ ప్రభుత్వం రూపొందించిన ఆర్- 5 జోన్‌ను ఉపసంహరించుకోవడంలో ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా ఉందనే విషయం తేలక రాజధాని వాసులు ఆవేదన చెందుతున్నారు.

● రెండున్నరేళ్లుగా కోర్టుల్లో నానుతున్న వ్యవహారం

గుంటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలక భూమిక పోషించే కీలక ప్రాంతాలైన వాణిజ్య, పారిశ్రామిక, విద్యా జోన్లను టార్గెట్ చేస్తూ రాజధాని మాస్టర్ ప్లాన్‌ను దెబ్బతీసేలా గత వైసీపీ ప్రభుత్వం ఆర్ 5 జోన్‌ను సృష్టించింది. అందులోభాగంగా మాస్టర్ ప్లానులో కీలకమైన ప్రాంతాలుగా గుర్తించిన రీజనల్ సెంటర్లు, టౌన్ సెంటర్లు, విద్యుత్ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన ప్రాంతాల్లో ఆర్-5 జోన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మంగళగిరి మండలంలోని కృష్ణాయపాలెంలో 10.18 ఎకరాలు, రీజనల్ సెంటర్ జోన్లో 62.45 ఎకరాలు, నిడమర్రులోని కాలుష్య రహిత పరిశ్రమల జోన్‌లో 670.33 ఎకరాలు, కురగల్లులో టౌన్ సెంటర్ జోన్లో 25.4 ఎకరాలు తీసుకుంది. మందడంలోని టౌన్ సెంటర్ జోన్లో 17.02 ఎకరాలు, నైబర్‌హుడ్ సెంటర్ జోన్లో 9.11 ఎకరాలు, బిజినెస్ పార్క్ జోన్లో 30.1 ఎకరాలు, ఎడ్యుకేషన్ జోన్‌లో 10.32 ఎకరాలు, ఐనవోలులో బిజినెస్ పార్క్ జోన్లో 1.48 ఎకరాలు, ఎడ్యుకేషన్ జోన్లో 51.67 ఎకరాలు, మొత్తంగా 900.97 ఎకరాలను జోన్-5 కింద గుర్తించినట్లు ఫైనల్ గెజిట్ చెబుతోంది. వీటితో కలిపి మొత్తం 1134.58 ఎకరాల భూమిని రెండు జిల్లాల కలెక్టర్లకు స్వాధీనం చేస్తున్నట్లు మార్చి 31న జీవో జారీ చేసింది.

● నివాస స్థలాల ఆర్- 3 జోన్‌ను కాదని.. కొత్త జోన్

2014లో భూసమీకరణ విధానంలో 34,387.06 ఎకరాల (మిగతా 6లో)

- మాస్టర్‌ప్లాన్‌ను దెబ్బతీసేలా జోన్‌ను సృష్టించిన గతప్రభుత్వం
- 'సెంటు పట్టాల' పేరుతో కీలక జోన్ల పందేరానికి కుట్ర
- హడావుడిగా లే అవుట్లు.. ఇళ్ల పట్టాల పంపిణీ
- న్యాయస్థానాల జోక్యంతో ఆగిన వ్యవహారం
- జోన్ రద్దుపై కూటమి సర్కార్ ఉదాసీన వైఖరి

యూరియా సరఫరా..

పకడ్బందీగా ఉండాలి

కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశాలు

జీడీడీపీలో లక్ష్యాన్ని అధిగమించిన గుంటూరు

స్వర్ణాంధ్ర కేపీఐలలో వెనకడుగు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 2025-26 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రబిలో యూరియా సరఫరా పకడ్బందీగా చేయించాలని సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియాకి సూచించారు. తొలుత జిల్లాకు ఎంత యూరియా అవసరమవుతుందో అంచనా వేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగో కలెక్టర్ల సదస్సు సోమవారం అమరావతి రాజధానిలోని వెలగపూడి సచివాలయంలో ప్రారంభమైంది. యూరియా అంశం చర్చకు వచ్చినప్పుడు ప్రభుత్వం నుంచి కలెక్టర్‌కు పలు సూచనలు చేశారు.

పర్యాటకరంగం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం సూచించింది. హోటల్స్, రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు, ఎంఐసీఈ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములను గుర్తించాలని సీఎం ఆదేశించారు. గుర్తించిన భూములను పర్యాటక శాఖకు కేటాయించాలి. పర్యాటక ప్రాజెక్టులు ఏవైనా సరే ఫాస్టుట్రాక్‌లో అనుమతులు మంజూరు చేయాలి. భూములు కేటాయించడమే కాదు ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా (మిగతా 6లో)

జీడీడీపీలో లక్ష్యాన్ని అధిగమించిన గుంటూరు

గ్రాస్ డొమెస్టిక్ డిస్ట్రిక్ట్ ప్రొడక్ట్(జీడీడీపీ)/స్థూల జిల్లా అంతర్గత ఉత్పత్తి విషయంలో జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో త్రైమాసికానికి కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించింది. జిల్లాకు రూ. 89,639 కోట్ల జీడీడీపీ లక్ష్యం కాగా త్రైమాసికంలో రూ. 16,539 కోట్లు సాధించింది. జిల్లాకు 17.96 శాతం లక్ష్యం కాగా 18.45 శాతం సాధించింది. మార్చి లోపు రూ. 73,100 కోట్ల లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉంటుంది.

స్వర్ణాంధ్ర కేపీఐలలో వెనకడుగు

స్వర్ణాంధ్ర కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)ల విషయంలో జిల్లా వెనకబడింది. ప్రభుత్వం ప్రకటించిన స్కోరులో 60 సాధించి బీ గ్రేడ్‌లో నిలిచింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలు కూడా బీ గ్రేడ్‌లోనే ఉన్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో కేపీఐకి సంబంధించి జిల్లా 27 స్కోరు మాత్రమే సాధించి సీ గ్రేడ్‌లో నిలిచింది. ఈ రంగంలో జీవీఏ(గ్రాస్ వాల్యూ యాడెడ్) లక్ష్యం రూ. 14,371 కోట్లు కాగా తొలి త్రైమాసికంలో రూ. 1,519 కోట్లు మాత్రమే సాధించింది. జిల్లా లక్ష్యం 14.90 శాతం కాగా 10.57 శాతం మాత్రమే సాధించగలిగింది. పారిశ్రామిక రంగానికి సంబంధించి కేపీఐలో 43 స్కోరుతో గుంటూరు సీ గ్రేడ్‌లో నిలిచింది. పెట్టుబడుల ప్రాజక్టులు త్వరగా గ్రౌండింగ్ చేయించే వాతావరణం కల్పించాలి. ప్రతీ 15 రోజులకు ఒకసారి పెట్టుబడుల ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించాలి. పరిశ్రమలకు అప్రోచ్ రోడ్లు, విద్యుత్, నీటి సదుపాయం కల్పించాలి. ఫైర్, బిల్డింగ్, లేఅవుట్ ప్లాన్, విద్యుత్ కనెక్షన్లు, డీడ్ రిజిస్ట్రేషన్లు క్లియర్ చేయాలి. భూసేకరణ చేసేటప్పుడు తగినంత నష్టపరిహారం చెల్లించాలి. పెద్ద పెద్ద క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం అందించాలని సీఎం సూచించారు.

ఆరోగ్యం..మన చేతుల్లోనే..!
● వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
● విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు
● రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం ● వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన

డీఎస్సీలో షేక్ మీర్జాకు రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంక్
మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల
8

రేపటి నుంచి..

ప్రత్యేక వైద్య శిబిరాలు

స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కింద ఏర్పాటు

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ వెల్లడి



గుంటూరు మెడికల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ రెండు వరకు రెండు వారాల పాటు "స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్" (ఆరోగ్యవంతమైన మహిళ- శక్తివంతమైన కుటుంబం) అనే సమగ్ర ఆరోగ్య ప్రచార్ సేవా కార్యక్రమము నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంచడం. మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడం వంటివి చేపడతారని ఆమె తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్, సామాజిక ఆరోగ్య కేంద్రాలలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. 17వ తేదీన గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచారశాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్థానిక ఎమ్మెల్యేలతో కలసి ఈ వైద్య శిబిరాలను ప్రారంభిస్తారని డీఎంహెచ్‌వో ప్రకటించారు. ఈ ప్రత్యేక వైద్య శిబిరాలలో పలు రకాల వైద్యసేవలు అందిస్తామన్నారు. మహిళలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన
డాక్టర్ కోడెల
● సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధికి కృషి
● నేడు 6వ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
8లో

పోలీస్ వర్గాల్లో.. కలకలం

వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు
● కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
● కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
● నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



8

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే....

ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలి: వీసీ గంగాధరరావు



సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగో ఆవిష్కరణలో వీసీ తదితరులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ఉత్తమ ఇంజనీర్లుగా ఎదగాలని ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల సివిల్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య గంగాధరరావు విచ్చేసి, ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సివిల్ ఇంజనీరింగ్ సంఘం లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో నాణ్యతతో కూడిన ప్రాజెక్టులు, ఆనకట్టలు నిర్మించారన్నారు. విశిష్ట అతిథి గుంటూరు డివిజన్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పూర్వ చీఫ్ ఇంజనీర్ జి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగు విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర విభాగాలతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ప్రిన్సిపాల్ ఆచార్య లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్.డి.చంద్రమౌళి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీకృష్ణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వరరావు ఇంజనీరు విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు.

ఐసెట్ ప్రవేశాల గడువు పొడిగించాలి

ఏపీ ఐసెట్-2025 ప్రవేశాల గడువును పొడిగించాలంటూ ఏఎన్‌యూ ఏఐఎస్ఎఫ్ శాఖ డిమాండ్ చేసింది. ఐసెట్ ప్రవేశాలకు తక్కువ సమయం ఇవ్వడంపై సోమవారం వర్సిటీలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, ఏఎన్‌యూ అధ్యక్షుడు నాసరయ్య మాట్లాడుతూ కన్వీనర్ సెలవు దినాలను పట్టించుకోకుండా ప్రవేశాలు కేటాయించి విద్యార్థులను అయోమయానికి గురి చేశారన్నారు. విద్యార్థులకు ఒకరోజు సమయం ఇవ్వడం అన్యాయమన్నారు. సెలవుల్లో విద్యార్థులు కళాశాలల నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకోలేక సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రవేశాల ప్రక్రియను కనీసం రెండు రోజులు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశాలకు పటిష్ఠ భద్రత

● ఎస్పీ, సీఎం సెక్యూరిటీ విభాగం ఎస్పీ సమీక్ష



సమీక్షిస్తున్న ఎస్పీలు ఆరిఫ్‌హఫీజ్, వకుల్ జిందాల్

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు, తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, సీఎం సెక్యూరిటీ విభాగం ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ స్పష్టం వెల్లడించారు. ఈ మేరకు సోమవారం వారు సచివాలయంలోని అసెంబ్లీ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వీవీఐపీ, వీఐపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ఉన్నతాధికారుల ప్రయాణ మార్గాలలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ఓపెనింగ్ పార్టీ టీమ్స్, ఏరియా డామినేషన్ బృందాలతో పటిష్ఠంగా తనిఖీ నిర్వహించి, ప్రయాణ మార్గాలకు ఇరువైపులా రూట్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. రూఫ్ టాప్స్, డ్రోన్ కెమెరాలతో మానిటరింగ్ చేయడానికి, ట్రాఫిక్, రూట్ బందోబస్తు నిర్వహణ కొరకు తగినంత మంది సిబ్బందిని కేటాయించాలన్నారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో సచివాలయంలోని ఆయా బ్లాకులు, కారిడార్లలలో ఉద్యోగులు, సందర్శకులు అనవసర కదలికలను కట్టడి చేయాలని సూచించారు. సచివాలయం మరియు పరిసర ప్రాంతాల్లో దిక్సూచి చిహ్నాలు, మార్గదర్శక చిహ్నాలను ఏర్పాటు చయాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలకు కేటాయించిన మార్గాల ద్వారా మాత్రమే వీవీఐపీ, వీఐపీ, మినిస్టర్లు, మీడియా, సందర్శకులు హాజరయ్యేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రహ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఇతరులకు అసౌకర్యం కలగకుండా తగిన ట్రాఫిక్ ఏర్పాట్లు చేస్తామన్నారు. రూట్ బందోబస్తు, బీడీటీం, ఏరియా డామినేషన్, ఇతర ప్రత్యేక బలగాలతో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ(అడ్మిన్) భద్రయ్య, తుళ్లూరు డీఎస్పీ మురళీ కృష్ణ, గుంటూరు జిల్లా ఎస్బీ సీఐ అలహరి. శ్రీనివాస్, అసెంబ్లీ చీఫ్ మార్షల్ గణేష్, పోలీస్ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచం విజేతలను మాత్రమే గుర్తిస్తుంది

● శాస్త్రవేత్త డాక్టర్ నాడగౌడ



మాట్లాడుతున్న డాక్టర్ వీఆర్ నాడ గౌడ

గుంటూరు (విద్య) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం ఎప్పుడూ విజేతలను మాత్రమే గుర్తిస్తుందని బెంగళూరులోని యూఆర్ రావ్ శాటిలైట్ సెంటర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డైరెక్టర్, శాస్త్రవేత్త డాక్టర్ వీఆర్ నాడగౌడ పేర్కొన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం జరిగిన ఇంజనీర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంతరిక్ష సాంకేతికతను నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచిం చారు. నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని స్కైరూట్ ఏరో స్పేస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీవీఎస్ కిరణ్ మాట్లాడుతూ భారత దేశానికి అవసరమైనది ఉద్యోగాల కోసం వెతికే యువత కాదని, ఉద్యోగాలను సృష్టించే ఇంజనీర్లు అవసరమని అన్నారు. ప్రతిభను వినియోగించి కొత్త పరిశ్రమలు, అవకాశాలను సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మన్నవ మోహన కృష్ణ పుట్టినరోజు వేడుకలు

● హాజరైన ప్రజా ప్రతినిధులు, కూటమి ముఖ్యనేతలు



ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, అరవిందబాబు, టీడీపీ నేత సుఖవాసితో కలిసి కేక్ కట్ చేస్తున్న మన్నవ



మోహనకృష్ణ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్సీ ఆలపాటి, దేగల

గుంటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ పుట్టినరోజు వేడుకలు గుంటూరులో అట్టహాసంగా జరిగాయి. మన్నవ మోహనకృష్ణ యూత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని చేబ్రోలు హనుమయ్య కంపెనీ గ్రౌండ్‌లో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలో వేలాది మంది పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు, మన్నవ మోహన కృష్ణ అభిమానులు, ఆత్మీయులు భారీ సంఖ్యలోగా పాల్గొన్నారు. మన్నవ మోహన కృష్ణకు గజమాలలతో స్వాగతం పలికారు. యూత్ సభ్యులు, అభిమానుల కేరింతల మధ్య మన్నవ మోహన కృష్ణ భారీ కేక్ కట్ చేశారు. ఈ జన్మదిన వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎమ్మెల్యే గళ్ళా మాధవి, చదలవాడ అరవింద్ బాబు, వేగేశ్న నరేంద్ర వర్మ, భాష్యం ప్రవీణ్, మహ్మద్ నసీర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఏపీఐడీసీ చైర్మన్లు డేగల ప్రభాకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వడ్రణం హరిబాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ తన జన్మదినాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన తన ఆత్మీయులకు కృతజ్ఞతలు తెలి పారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజ లకు ధన్యవాదాలు తెలియచేసి, తనను ప్రోత్సహించి, పార్టీలో, ప్రభుత్వంలో తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు, తనను అనునిత్యం ప్రోత్సహించే నందమూ రి బాలకృష్ణకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు, లోకేశ్ అడుగుజాడల్లో నడుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి, తెలుగు దేశం పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తానని మన్నవ తెలిపారు. మన్నవ మోహన కృష్ణ తన జన్మ దినం సందర్భంగా సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గుంటూరులోని మాతృశ్రీ పిల్లల ఆశ్రమంలో అనాథ పిల్లలకు స్కూల్ యూనిఫాంలు, పుస్తకాలు అందించారు. ఆ తరువాత ఆసుపత్రిలో పండ్లు పంచారు. తరువాత అనురాగ్ ఓల్డేజ్ హోంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

ట్రాఫిక్ పోస్టుకు ఉరేసుకుని ఆత్మహత్య



వేలాడుతున్న మృతదేహం

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా, తాడేపల్లి పరిధిలోని హైవే మధ్యలో ఉన్న ట్రాఫిక్ పోస్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడు బైరి వెంకన్న (45) స్వస్థలం శ్రీకాకుళం కాగా ప్రస్తుతం విజయవాడలోని బాపట్ల వీధిలో పండ్లు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడు మద్యపానానికి బానిసై అప్పుల భారాన్ని తట్టుకోలేక ప్రతి రోజూ ఇంటి నుండి బయటికి వెళ్లి మద్యం సేవించేవాడు. సోమవారం తాడేపల్లి హైవేపై ఉన్న ట్రాఫిక్ పోస్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిర్మల యాజమాన్యంపై కేసు నమోదు

మంగళగిరి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూరు నిర్మల సీబీఎస్ఈ హైస్కూల్ యాజమాన్యంపై మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పాఠశాలలో పదవ తరగతి చదివిన 82 మంది విద్యార్థుల మార్కుల జాబితా అదృశ్యం కావడం, ప్రశ్నించిన విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై కేసు నమోదు చేశారు. నిర్మల పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులు మార్కు లిస్టుల కోసం నెలల తరబడి పాఠశాల చుట్టూ తిరుగుతున్నా యాజమాన్యం నుంచి స్పందన లేదు. అసలు విషయం ఆరా తీయగా ఢిల్లీ నుంచి పాఠశాలకు వచ్చిన మార్కుల జాబితా బండిల్ అదృశ్యమైందని తేలింది. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం పట్ల తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. మండల విద్యా శాఖ అధికారులు పాఠశాల యాజమాన్యాన్ని పిలిపించి విచారణ జరిపారు. యాజమాన్యంపై కేసు నమోదు కావడంతో మంగళగిరి రూరల్ పోలీసులు పాఠశాల కార్యాలయంలో సోదాలు నిర్వహిం చారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి



విడుదలవుతున్న నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని భారీగా విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 2,40,185 క్యూసెక్కుల వరదనీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదు అవుతుండగా దిగువకు 2,29,225 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 6,948, పశ్చిమ డెల్టాకు 4,012 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139, 150, 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

వ్యాయామ ఉపాధ్యాయుడిపై డిప్యూటీ ఈఓ విచారణ

కర్లపాలెం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా గతంలో పనిచేసిన మద్దెన గోపీపై విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డికి తల్లిదండ్రులు, విద్యార్థులు ఫిర్యాదు చేశారని బాపట్ల జిల్లా ఉప విద్యాశాఖాధికారి కె.సురేష్ సోమవారం తెలిపారు. ఎన్‌సీసీ కార్యక్రమంలో విద్యార్థులకు మంజూరైన దుస్తులు, అలవెన్స్‌లు కాజేయడమే కాక పలు అవకతవకలకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గోపీపై విచారణకు డీఈవో శ్రీరామ్ పురుషోత్తం ఆదేశాల మేరకు చింతాయపాలెం హైస్కూల్‌లో విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. తల్లింద్రులను, విద్యార్థులను విచారించామని వాస్తవ రికార్డులను పరిశీలించి పూర్తి నివేదికలను డీఈఓకు అందజేస్తామని సురేష్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విజయశ్రీ, మనోరంజనీ, ప్రధానోపాధ్యాయులు వేణు మాధవ్ ఉన్నారు. సురేష్ విచారణ జరుపుతున్న సమయంలో పాఠశాల వద్ద ఎస్ఎంసీ ఉపాధ్యక్షురాలు పిట్టు నాగలక్ష్మి, కుమార్తె పాఠశాల బయట ఉండగా.. వెనిగండ్లలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సస్పెండ్ అయిన పేరం మస్తాన్‌రెడ్డి కొంత మంది విద్యార్థులు, తల్లిదండ్రులతో అక్కడికి చేరుకున్నాడు. ఈ సమయంలో కుమార్తెను ఫొటోలు తీస్తున్న మస్తాన్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. దాడికి పాల్పడ్డాడని నాగలక్ష్మి తెలిపింది. దీంతో అతనిపై దాడి చేయాల్సి వచ్చిందని వివరించింది.

27 నుంచి వీణా అవార్డ్స్ నాటిక, నాటక పోటీలు



వివరాలు వెల్లడిస్తున్న సాయి మాధవ్ తదితరులు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వీణా అవార్డ్స్-2025 నాటిక, నాటక పోటీలను దసరా సెలవుల్లో ఈ నెల 27 నుంచి ప్రారంభమవుతాయని సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. కళల కాణాచి ఆర్ఎస్ఆర్ గ్రీన్‌వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు 21 ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. 9 పద్య, ఐదు సాంఘిక నాటకాలు, ఏడు సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారని వెల్లడించారు. ఉత్తమ ప్రదర్శనకు ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారం రూ.12,116, బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం రూ.25వేలు, వేద గంగోత్రి వరప్రసాద్ రంగస్థల పురస్కారం 11,116 ప్రదానం చేస్తామని చెప్పారు. పద్య నాటకాల్లో రూ.లక్ష, బంగారు వీణ, రూ.75 వేలు, వెండి వీణ, రూ.50 వేలు, కాంస్య వీణ, సాంఘిక నాటకాలకు రూ.60 వేలు, బంగారు వీణ, రూ.50 వేలు, వెండి వీణ, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా అందిస్తామన్నారు. ప్రతి నాటకానికి రూ.30-50 వేలు వరకు ప్రదర్శన పారితోషికం ఉంటుందన్నారు. కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు ఉదయం పద్య నాటకాలు, సాయంత్రం సాంఘిక నాటిక, నాటకాలు ప్రదర్శనలు ప్రదర్శిస్తారని తెలిపారు. చెరుకుమల్లి సింగారావు, వేమూరి విజయభాస్కర్, గోగినేని కేశవరావు, హకీంజాని, భవానీ, మల్లేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో..

రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు సీఎం కృషి

● ఏపీ, సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ రవి



రవిని సత్కరిస్తున్న సుబ్బారావు, ప్రవాసాంధ్రులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సారథ్యంలో రాష్ట్రాన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమి చైర్మన్ మందలపు రవి పేర్కొన్నారు. అమెరికాలోని న్యూ జెర్సీలో ప్రవాసాంధ్రులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సవాళ్లను, వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే విజేతలుగా నిలుస్తారన్నారు. సభలో పాల్గొన్న మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఇతర వక్తలు మాట్లాడుతూ దేశంలోనే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఏపీని రవి ముందు వరుసలో ఉంచుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని భీమినేని శ్రీనివాస్, శ్రీనాథ్ పర్యవేక్షించగా, చిల్లర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ..

మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో..

గుంటూరు (విద్య) సెప్టెంబరు15 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సీవీ రేణుక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఓ, కలెక్టరేట్ కార్యాలయంలో జాబితా ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర సమాచారం కోసం డీఈవో కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం డీఈఓజీఎన్‌టీ బ్లాగ్ స్పాట్.కాంలో చూడాలని సూచించారు.

ఆర్- 5 జోన్‌పై.. మీనమేషాలు!?

(5వ పేజీ తరువాయి)

భూములిచ్చిన 28,706 మంది రైతులకు వారి గృహ, వాణిజ్య అవసరాల కోసం అభివృద్ధి చేసిన రిటర్నబుల్ ప్లాట్లను కేటాయిస్తానని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు ఆర్ 3 జోన్‌ను ఏర్పాటు చేసింది. ఈ జోన్‌లో 11,681 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో 6,993.82 ఎకరాలు భూములిచ్చిన రైతులకు ప్లాట్లు, వాణిజ్య సముదాయాలకు, మరో 340 ఎకరాలు గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు కేటాయించారు. కాగా ఈ జోన్‌లో ఇంకా 4,527.18 ఎకరాలు మిగిలి ఉంది. కాగా సీఆర్డీఏ ఒప్పందం ప్రకారం రాజధాని పరిధిలో ఇళ్లు లేని పేదల ఇళ్ల కోసం రైతులు ఇచ్చిన భూమిలో 5 శాతం కేటాయించాలి. ఆ మేరకు ఈ మిగిలిన 4,527 ఎకరాల్లో 1,719.35 ఎకరాల భూమిని భూమి లేని పేదలకు కేటాయించారు. ఆ ఒప్పందం ప్రకారమే ఈ 1,719 ఎకరాల్లో 44 ఎకరాలు టిడ్కో ఇళ్ల నిర్మాణానికి వినియోగించారు. ఇళ్లులేని పేదల కోసమే ప్రత్యేకంగా కేటాయించిన మిగిలిన 1675 ఎకరాలు అలానే ఖాళీగా ఉన్నాయి. అయినప్పటికీ ఆ స్థలాలను కాదని రాజధాని గ్రోత్ ఇంజన్‌గా భావించే ఎలక్ట్రానిక్ సిటీ, పారిశ్రామిక అవసరాల కోసం కేటాయించిన భూముల్లో 1,134 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి పూనుకుంది. దీంతోపాటు అత్యంత ఆవస్యక సమయాల్లో వినియోగించుకునేందుకు కేటాయించిన ఎస్ 3 జోన్లో మరో 268 ఎకరాల భూమిని ఇళ్ల స్థలాలకు కేటాయించింది అప్పటి వైసీపీ ప్రభుత్వం

కోర్టుల్లోనే ఆర్- 5 జోన్ వ్యవహారం

రాజధాని గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వం సృష్టించిన ఆర్- 5 జోన్‌పై రాజధాని రైతులు న్యాయపోరాటం చేశారు. రాష్ట్ర, కేంద్ర అత్యున్నత న్యాయస్థానాల తలుపు తట్టారు. దీంతో వ్యవహారం అర్థాంతరంగా నిలిచిపోయింది. అయితే అప్పటికే వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చింది. తానే ఇళ్లు కట్టించేందుకు పూనుకుని వంద కోట్లు ఖర్చు చేసి అన్ని చోట్ల లే అవుట్లు వేసి, హడావుడిగా రోడ్లు,విద్యుత్ లైన్లు వేసింది. హడావుడిగా ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభించింది. సుప్రీం కోర్టు అడ్డు చెప్పడంతో అప్పటి నుంచి వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్య తొలగిపోతుందని రైతులతోపాటు, స్థానిక ప్రజలు అందరూ భావించారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్- 5 జోన్ జీవోను ఉపసంహరించుకుంటుందని, తద్వారా ఆర్- 5 జోన్ రద్దవుతుందని భావించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చి 15 నెలలైనా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో రైతులు కలవరం చెందుతున్నారు.

యూరియా సరఫరా.. పకడ్బందీగా ఉండాలి

(5వ పేజీ తరువాయి)

చూడాలన్నారు. ప్రతీ నెలా పర్యాటక మండలి సమావేశం జిల్లా స్థాయిలో జరగాలి. ప్రతీ సంవత్సరం ఫుడ్ ఫెస్టివల్స్‌ని నిర్వహించాలన్నారు. ఈ నెల మూడో వారం ఆఖరుకల్లా జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పీఎంఏవై అర్బన్ బీఎల్‌సీ, పీఎంఏవై గ్రామీణ్ కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలి. వచ్చే ఏడాది జనవరి, జూన్ నాటికి విధించిన లక్ష్యాలను అధిగమించాలి. ప్రతీ 15 రోజులకు ఒకసారి మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, గ్రామ, వార్డు సెక్రటరీలతో సమీక్ష నిర్వహించి గృహనిర్మాణాలను పురోగతిలోకి తీసుకురావాలన్నారు. అలానే లబ్ధిదారులతో నేరుగా ముఖాముఖీగా సమావేశమై సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. సర్వీసు సెక్టార్‌కు అత్యధికంగా ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. విమానాలు, పడవల ద్వారా సరుకు రవాణ ఎక్కువగా జరిగేలా చూడాలి. వేర్‌హౌస్‌లు, కోల్డ్‌స్టోరేజ్‌ల నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. బ్యాంకింగ్ సిస్టమ్‌లో క్రెడిట్‌లు, డిపాజిట్‌లు విస్తరించాలి. లైఫ్, నాన్ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ ప్రీమియంని పెంచాలన్నారు. రియల్‌ఎస్టేట్, విద్య, వైద్యం, రిక్రియేషన్‌పై ఎక్కువగా దృష్టి పెడితే సర్వీసు సెక్టార్ బాగా అభివృద్ధి చెంది ఉద్యోగ, ఉపాధి కల్పన జరుగుతుందన్నారు.

ఏపీ పీజీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆదేశాల మేరకు ఏపీ పీజీసెట్-2025 కౌన్సెలింగ్ షెడ్యూల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఏపీ పీజీసెట్ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలింగ్ పేర్ల నమోదు ప్రక్రియ ఈ నెల 17 వరకు, ఆన్‌లైన్ విద్యార్హత సర్టిఫికెట్ల పరిశీలన 18 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 20 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22న ప్రవేశాలు కల్పిస్తామని, ఈ నెల 23 నుంచి 25 లోపు సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు చేరాలని ఆయన సూచించారు. పీజీ తరగతులు ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఏఎన్‌యూ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో క్యాప్, స్పోర్ట్స్, ఎన్ఎస్ఎస్ క్యాటగిరి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని వెల్లడించారు. దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన తేదీలను త్వరలో ప్రకటిస్తామని కన్వీనర్ తెలిపారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ముంపు బాధితులకు అండగా ఉంటా

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు ఇళ్లలోకి నీళ్లు చేరి ఇబ్బందులకు గురవుతున్న బాధితులకు అండగా ఉంటానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నగరంలోని ముప్తీ బజార్, ఆనందపేట, సుద్దపల్లి డొంక ప్రాంతాల్లో ఎమ్మెల్యే సోమవారం ఉదయం పర్యటించారు. ఇప్పటికీ నీరు బయటకు పోకుండా ఇబ్బందులు పడుతున్న వారిని పరామర్శించి అండగా నిలుస్తామని భరోసాచ్చారు. కొందరి ఇళ్లలో నిత్యావసర సరుకులు దెబ్బ తినడాన్ని గుర్తించి, వారికి సరుకులు తెచ్చుకోవడానికి సహాయం చేశారు. పీకల వాగులో వర్షపు నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సిల్ట్ అడ్డుగా నిలుస్తున్నట్లు గుర్తించారు. నగర మేయర్, కమిషనర్‌కు ఫోన్లో సమస్యను వివరించారు. అనంతరం సుద్దపల్లి డొంక 14వ డివిజన్లో వంతెనలపై ఆక్రమణలను సిటీ ప్లానర్‌కు వీడియో కాల్ ద్వారా చూపించి సమస్యను వివరించారు. తమ ప్రాంతంలో శానిటేషన్ పనులు సక్రమంగా జరగడం లేదని స్థానికులు ఎమ్మెల్యే నసీర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గాలి సతీష్ బాబు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక నిపుణులు సమాజ నిర్మాణానికి సారథులు

● విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య



మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు (విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువ సాంకేతిక నిపుణులు సమాజానికి వారధులుగా నిలవాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య విజ్ఞప్తి చేశారు. పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. తొలుత సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక, ప్రొడ్యూసర్ ట్రస్ట్ ప్రోగ్రాం డైరెక్టర్ మన్నవ శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన 'మిస్ ఫ్రెషర్ 2025' పోటీలో మొదటి సంవత్సరం చదువుతున్న ఐటీ విద్యార్థిని పూజిత విజేతగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తెలిపారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో...



మాట్లాడుతున్న కల్నల్ దీపక్ కుమార్ శర్మ

గుంటూరు (విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరులోని 25 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ వలన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం, సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో నేర్చుకుంటారని తెలిపారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు స్వేచ్ఛగా విద్యాభ్యాసం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్‌వీఆర్ జేసీలో ఇంజనీర్స్ డే వేడుకలు



విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు (విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగం దేశ ఆర్థిక, సాంకేతిక ప్రగతికి వెన్నెముక అని వివరించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య కృషి నేటికీ భవిష్యత్ యువతకు ఆదర్శనీయమని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలతో భారత దేశకీర్తిని ప్రపంచ దేశాలకు చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాసేపు కాలక్షేపం చేద్దాం గురూ.....!

● పీజీఆర్‌ఎస్‌లో అధికారుల తీరు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కొంత మంది అధికారులు కాలక్షేప వేదికగా మారుస్తున్నారు. శంకరన్ సమావేశం మందిరంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కొంతమంది సెల్ ఫోన్‌లో మునిగిపోగా, మరి కొంతమంది ఫోన్లో మాట్లాడుతూ కనిపించారు. మరి కొంతమంది అయితే కునుకుతీస్తూ కనిపించారు. ఇదిలాఉంటే అర్జీలు రాసే వారు... ఆన్లైన్లో నమోదు చేసే సిబ్బంది కూడా అర్జీదారులను పెద్దగా పట్టించుకోవడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలను ఓర్చుకొని వచ్చిన అర్జీదారులు సిబ్బంది, అధికారుల తీరు చూసి మా సమస్యలు ఎప్పుడు పరిష్కారమవు తాయో తెలియక అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.



సెల్‌ఫోను చూస్తున్న అధికారులు



కునుకుతీస్తున్న ఉద్యోగి

బీజేపీలో కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు

● కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. అందుకు తాజా నిదర్శనమే పార్టీ రాష్ట్ర మీడియా కో-కన్వీనర్ వెలగలేటి గంగాధర్‌ను రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడమన్నారు. సోమవారం అమరావతిలోని తన క్యాంపు కార్యాలయానికి గంగాధర్‌ని పిలిపించి మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు శ్రీదేవి, పాలపాటి రవికుమార్, ఈమని మాధవరెడ్డి, యువమోర్చా నాయకులు జంధ్యాల సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలలో జిల్లాకు పతకాలు

గుంటూరు (క్రీడలు) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ లయోలా కాలేజీలో ఈనెల 13, 14వ తేదీలలో రెండు రోజులపాటు రాష్ట్ర స్థాయి ఘట్కా (కర్ర సాము) ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో గుంటూరుకు చెందిన సంకటి జ్ఞాన శ్రీవల్లి అండర్-12 బాలికల విభాగంలో బంగారు పతకాన్ని, కాసరబాద భరత్ కుమార్, అండర్-25 విభాగంలో బంగారు పతకాన్ని సాధించగా, సూర్యదేవర జయదేవ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా శిక్షకులు మళ్ళీ శ్రీనివాసరావు, బండి కిరణ్ బాబు, క్రీడాభారతి దక్షిణ మధ్య సంయోజక్ చంద్రశేఖరరావు విజేతలను అభినందించారు.

నిర్ణీత గడువులో అర్జీలను పరిష్కరించాలి

● జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 221 అర్జీలు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి 221 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ అందుబాటులో లేక పోవడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మికుమారి, డీఆర్వో ఖాజావలీతో కలసి ఆయన అర్జీలను స్వీకరించారు. అనంతరం అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ అర్జీదారుని సమస్యను పరిష్కరించిన విధానాన్ని క్షుణ్ణంగా తెలిపి, అధికారి పనితీరు మీద ఫీడ్ బ్యాక్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సీతారామిరెడ్డి, డీఎఫ్‌వో శైలజ, ఐసీడీఎస్ పిడి ప్రసూన, ఎల్‌డిఎం మహిపాల్‌రెడ్డి, బిసి వెల్ఫేర్ అధికారి మయూరి, పౌర సరఫరా సంస్థ మేనేజర్ తులసి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు తదితరులు

తురకపాలెంలో మృతులకు పరిహారం ఇవ్వాలి

తురకపాలెం గ్రామంలో గత రెండు, మూడు నెలలుగా సంభవించిన అసాధారణ మరణాలకు సంబంధించి మృతుల కుటుంబాలకు తక్షణమే పరిహారం ఇవ్వాలని విదసం ఐక్యవేదిక ఆధ్వర్యంలో మృతుల కుటుంబ సభ్యులతో కలిసి అర్జీ అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు బూసి వెంకటేశ్వరరావు, నల్లపు నీలాంబరం, డి.జాన్‌పాల్, బి.స్టాలిన్ బాబు ఉన్నారు.

● తురకపాలెంలో చనిపోయిన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులతో కలిసి వైసీపీ ఇన్‌చార్జ్ బాలసాని కిరణ్‌కుమార్ వినతి పత్రం అందజేశారు.

యానాది కుటుంబాలకు స్థిర నివాసం ఏర్పాటు చేయాలి

స్థానిక 51వ డివిజన్, కాకుమాను వారి తోట లోని కార్మిక శాఖ స్థలంలో నివాసం ఉంటున్న 22 యానాది కుటుంబాల వారికి స్థిర నివాసం ఏర్పాటు చేయాలని బహుజన మహాసభ నాయకులు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, ముత్తయ్య, లక్ష్మీనారాయణ, తస్నీరు సాంబయ్య తదితరులు ఉన్నారు.

సెలవు దినాలకు చెల్లించాల్సిన వేతనాలు విడుదల చేయాలి

జాతీయ, పండుగ సెలవులకు సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో విద్యుత్ కార్మికులు అర్జీ అందజేశారు. 2018 నుంచి 2022 వరకు గుంటూరు సర్కిల్ డివిజన్‌లో కార్మికులకు నేటి వరకు చెల్లింపులు జరగలేదన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో లక్ష్మణరావు, గంగిశెట్టి నాగరాజు, రాంబాబు తదితరులు ఉన్నారు.

వరద నీటిని బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలి

నగరంలోని వర్షపు నీటిని బయటకు పంపేలా ప్రణాళికలు రూపొందించాలని గుంటూరు జిల్లా కాంగ్రెస్ కమీటి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ మధ్య సరైన ప్రణాళిక లేకుండా సైడ్ కాలువలు నిర్మించారని, దీనికి తోడు కాంట్రాక్టర్ల అవినీతి తోడైందన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ తమిమ్ అన్సారియా, మొక్క అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

సీఎంకు కలెక్టర్, ఎస్పీ స్వాగతం

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు అమరావతి రాజధానిలోని రాష్ట్ర సచివాలయానికి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు జిల్లా నూతన కలెక్టర్ తమిమ్ అన్సారియా స్వాగతం పలికారు. సోమవారం ఉదయం కలెక్టర్‌తో పాటు ఎస్పీ వకుల్ జిందాల్ సీఎంకు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

జిల్లాలో ఎయిడ్స్ ప్రచార రథంతో విస్తృత అవగాహన

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



జెండా ఊపి రథాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమూహాలు ఉన్న ప్రాంతాల్లో, మురికివాడల్లో ఎయిడ్స్ ప్రచార రథం పర్యటించి హెచ్ఐవీ/ఎయిడ్స్ నివారణపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా ప్రచార రథాన్ని జెండా ఊపి సోమవారం ఆమె ప్రారంభించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ ప్రచార రథం 15 రోజులపాటు పర్యటిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.శ్రావణకుమార్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణిరత్నశ్రీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం మేనేజర్ డాక్టర్ శాంసన్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటికి కట...కట

● నల్లపాడు రోడ్డులో పైపులైను ఇంటర్ కనెక్షన్ పనులు

● పలు ప్రాంతాల్లో నిలిచిన తాగునీటి సరఫరా



పైపు లైనుకు ఇంటర్ కనెక్షన్ పనులు చేస్తున్న సిబ్బంది

గుంటూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నల్లపాడు రోడ్డులో తాగునీటి పైప లైను ఇంటర్ కనెక్షన్ పనులతో పరిసర ప్రాంత వాసులు తాగునీటికి కటకట లాడాల్సి వచ్చింది. మిర్చియార్డులోని వాటర్ ట్యాంకులోకి సరఫరా అయ్యే పైపులైను మెయిన్ రోడ్డులో కుంగిపోవటంతో మరో ప్రాంతంలో ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నుంచి నగరపాలక సంస్థ సిబ్బంది ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టారు. ఆదివారం వర్షంతో పనుల్లో జాప్యం నెలకొన్నది. దాంతో నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్, ఆదర్శనగర్, సుబ్బారెడ్డి నగర్‌తో పాటు పరిసర కాలనీల్లో శనివారం మధ్యాహ్నం నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అయితే కనీసం ముందస్తు సమాచారం లేకుండా పనులు చేపట్టటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు పనులు కొనసాగాయి.

బహుజనులు సంఘటితమై రాజకీయ శక్తిగా ఎదగాలి

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బహుజనులు సంఘటితమై బలమైన రాజకీయ శక్తిగా ఎదగటం ద్వారా డాక్టర్ అంబేద్కర్, కాన్సీరాం లు ఆశించిన సామాజిక స్థాపనకు పాటు పడాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బంతేల గౌతమ్ ఆశించారు. ఈ మేరకు సోమవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 'బహుజన సంకల్ప' సభ స్థానిక కొరటాల భవన్ సమావేశ మందిరంలో జరిగింది. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తెనాలి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు బందేల గౌతమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్ర కో ఆర్డినేటర్ మల్లికల్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనులు రాజకీయ సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. సభలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పుష్పరాజ్, రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావు, మణి కుమారి, వై.కిశోర్, చిరతనగుండ్ల వాసు, కారుమంచి సునీల్ సందీప్, బాబూరావు, సాంబశివరావు, ప్రేమ రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ పూజిత స్కూల్ ఉపాధ్యాయునికి సన్మానం



అవార్డు అందుకుంటున్న రాజారత్నబాబు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలోని శ్రీ పూజిత స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న జాలాజి రాజా రత్నబాబు పాన్ ఇండియా ఎడ్యుకేషన్ అవార్డు అందుకున్నారని ప్రిన్సిపల్ కంచర్ల పద్మావతి సోమవారం తెలిపారు. సందర్భంగా రత్నబాబును పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

విశ్రాంత హెచ్‌ఎం వెంకటరావు కన్నుమూత



కొండబోలు వెంకటరావు

గుంటూరు విద్య సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : శ్రీ పాటిబండ్ల సీతారామయ్య (ఎస్పీఎస్) ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కొండబోలు వెంకటరావు(73) అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. అంతిమయాత్ర మంగళవారం ఉదయం సిద్ధార్థ నగర్‌లోని ఆయన స్వగృహం నుంచి ప్రారంభం కానున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ట్రాక్టర్ డ్రైవర్ కిడ్నాప్... హత్య

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతమ్మకాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వేముల రామాంజనేయులు (35)ను కిడ్నాప్ చేసి హత్య చేసారు. మృతదేహాన్ని అద్దంకి సమీపంలోని హైవే దగ్గర ఉన్న నీటి కుంటలో పడేసారు. అయితే ఈ కేసులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని హతుడు కుటుంబ సభ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నాకు దిగారు. బాధితులు, పోలీసుల కథనం మేరకు సీతమ్మకాలనీ 2వ లైనుకు చెందిన రామాంజనేయులు ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఆయనకు భార్య శివపార్వతి ఉన్నారు. ఈ నెల 6న బయటకు వెళ్ళిన భర్త తిరిగి రాకపోవటంతో 7న భార్య శివపార్వతి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో అదే కాలనీకి చెందిన బండారు కొండయ్యపై అనుమానం ఉందని పోలీసులకు చెప్పింది. కొండయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో రామాంజనేయులును తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. కొండయ్య ఇచ్చిన సమాచారంతో పోలీసులు అద్దంకి సమీపంలోని హైవే పక్కన నీటి కుంటలో ఉన్న రామాంజనేయులు మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కొండయ్య భార్యతో రామాంజనేయులుకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కొండయ్య తన స్నేహితుడి సహకారంతో ఈ హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.

తప్పుడు కేసు బనాయించి వేధిస్తున్నారు

● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన టీడీపీకి చెందిన దంపతులు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలుగా పార్టీ కోసం పనిచేస్తున్న తమపై వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎనుమల చంద్రశేఖర్ తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని అమరావతి రోడ్డులోని కొండయ్య కాలనీ జీరో లైన్‌కి చెందిన కచ్చాల రవికుమార్, లలిత దంపతులు వాపోయారు. ఈ మేరకు సోమవారం వారు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.

వడ్డీ వ్యాపారి వేధింపులతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

వడ్డీ వ్యాపారి వద్ద అప్పుగా తీసుకున్న లక్ష రూపాయలకు ప్రతినెల వడ్డీ చెల్లిస్తున్నప్పటికీ వ్యాపారి వేధింపులు అధికం కావడంతో బీటెక్ విద్యార్థి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వ్యాపారి వేధింపులపై బీటెక్ విద్యార్థి శివనాగుమల్లేశ్వరరావు తల్లి మిర్యాల మల్లేశ్వరి సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. మేడికొండూరు మండ లం కొత్తపాలెంకు చెందిన వడ్డీ వ్యాపారి లక్ష్మణ ఒత్తిడి తట్టుకోలేక మల్లేశ్వరరావు నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు.

ఆస్తి రాసివ్వాలంటూ తల్లిదండ్రులపై తనయుడి దాడి

మానసిక వికలాంగుడైన చిన్న కుమారుడి ఆలనా పాలన చూసుకుంటుంటే పెద్ద కుమారుడు ఆస్తిరాశి ఇవ్వాలంటూ తమపై దాడికి పాల్పడుతున్నాడని యామర్తికి చెందిన పి నాగమల్లేశ్వరరావు, అరుణ్ కుమారి దంపతులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తమను కొడుతున్నాడని, న్యాయం చేయాలంటూ తల్లిదండ్రులు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్నా కనికరం చూపించని భర్త

తాను క్యాన్సర్‌తో బాధపడుతున్నా తన భర్త కనీసం కనికరం చూపించడం లేదని సీతమ్మ కాలనీ జీరో లైనుకు చెందిన షేక్ ఆషాబేగం సోమవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. తనకు, తన చెల్లెలు షకీలా బేగానికి అమరావతి చెంచు కాలనీలో ఐదు సెంట్ల ఖాళీ స్థలం ఉంది అన్నారు. అయితే మాయమాటలు చెప్పి అందులో సగం స్థలాన్ని తన భర్త ఆయన పేరుతో రాయించుకున్నాడని ఆషాబేగం తెలిపారు. అయితే ఆ మొత్తం స్థలాన్ని నీ పేరుతో రాస్తానని చెప్పి తన మరదలు షకీలా బేగం నుంచి 16 లక్షలు తీసుకున్నాడన్నారు. అంతేగాక ఆస్తిపత్రాలు, ఆషాబేగం క్యాన్సర్‌కి సంబంధించిన రిపోర్టులు తీసుకొని ఇవ్వడం లేదని అక్క చెల్లెళ్ళు ఎస్పీ కార్యాలయంలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

బదిలీ అయిన ఎస్పీ సతీష్‌కుమార్‌కు ఘనంగా వీడ్కోలు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బదిలీ అయిన ఎస్పీ సతీష్‌కుమార్‌కు జిల్లా పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు సోమవారం రాత్రి పోలీస్ కార్యాలయంలో నూతన ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో ఆత్మీయవీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సీఐలు ఎస్పీ సతీష్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం వారికి విందు ఏర్పాటు చేసారు.

పెయింట్ వేస్తూ తాడు తెగి వ్యక్తి మృతి

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గోరంట్ల అన్నపూర్ణ నగర్ నాలుగో లైన్ లో బిల్డింగు కు పెయింటింగ్ వేస్తుండగా తాడు తెగీ పెయింటర్ కింద పడి మృతి చెందాడు. ఈ ఘటనలో తాడికొండ మండలం దామరపల్లి గ్రామానికి చెందిన పెరుమాళ్ళ వీర్లంకయ్య (26) మృతి చెందాడు. మృతుల తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ శ్రీరామరక్ష

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ శ్రీరామరక్ష అని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.14.25 లక్షల చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలతో పాటే ఉంటుందన్నారు. అవసరంలో సహాయం అందించడమే తమ ప్రధాన కర్తవ్యంగా భావిస్తున్నాం' అని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. పేదలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదుకుంటున్నారని, అది పేదల పట్ల ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.



ఎమ్మెల్యే మాధవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దామచర్ల శ్రీనివాసరావు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన దామచర్ల

ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) సభ్యుడిగా నియమితుడైన టీడీపీ నేత దామచర్ల శ్రీనివాసరావు సోమవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలి : ఏపీటీఎఫ్

గుంటూరు (విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.బసవలింగారావు విజ్ఞప్తి చేశారు నిరసన వారం కార్యక్రమంలో భాగంగా సోమవారం లాడ్జి సెంటర్లో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ నిరసన ప్రదర్శనకు ఏపీటీఎఫ్ గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, జోనల్ నాయకులు పి.లక్ష్మీనారాయణ, జి.దాస్, చక్క వెంకటేశ్వరరావు, సాయి లక్ష్మీ, వేణు, పి.శివరామకృష్ణ, బాలరాజు, కిరణ్, గురుమూర్తి సిద్దిక్, లక్ష్మీ, రమాదేవి, నిర్మల, నరసింహారావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆరోగ్యం.. మన చేతుల్లోనే..!

● కాస్త ఆలోచించి తినండి !
● వీధుల్లో చిరుతిండ్లతో అనారోగ్యం
● విజృంభిస్తున్న వైరల్ ఫీవర్లు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తురకపాలెంలో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. నీటి కలుషితమా... వైరల్ ఇన్‌ఫెక్షన్లా.. అనేది కనుగొనేందుకు వైద్యులు సతమతమవుతున్నారు. తురకపాలెంలో జరిగిన వరుస మరణాలతో జిల్లా వైద్య యంత్రాంగం అప్రమత్తమైంది. ఎక్కడా కూడా నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తోంది. పల్నాడు జిల్లాలోనూ గత కొద్ది రోజులుగా సీజనల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తలనొప్పి, జలుబు, జ్వరాలతో ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రస్తుత వర్షాకాలం వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో ఆహారం విషయంలో ఎంత మాత్రం అలసత్వం వహించినా ఆసుపత్రులపాలై రూ.వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎంత ఖర్చు చేసినా ఒక్కోసారి ప్రాణం పోయే పరిస్థితి ఏర్పడుతుంది. మనం తినే ఆహారం పట్ల కొద్ది రోజులు తగు జాగ్రత్తలు పాటించకపోతే పైప్రాణాలు పైనే పోతాయన్న వైద్యుల మాటలు ప్రతి ఒక్కరూ విని తీరా వాటిని పాటించి తీరాల్సిందే.


జానపాడు రోడ్డు పక్కన ఫాస్ట్‌ఫుడ్ తింటున్న యువత

అన్నీ రోడ్లపైనే..

ఫాస్ట్‌ఫుడ్, చికెన్ మసాలా, పానీపూరి బండి, చికెన్, మటన్ దుకాణాలు ఎక్కడ చూసినా రోడ్ల పక్కనే కనిపిస్తున్నాయి. వాహనాలు వేగానికి లేచిపడే దుమ్మూధూళి అంతా వాటిపైనే పడిపోతున్నా మూతలు పెట్టకుండా విక్రయించేస్తున్నారు. మాంసం విక్రయించే వ్యక్తి చేతులు అపరిశుభ్రంగా ఉంటే.. బ్యాక్టీరియా సులువుగా ఒకరి నుంచి మరొకరికి చేరి రోగాలు తెచ్చిపెడతాయి. మిఠాయిలోనూ వాడే పలు రకాల రంగులతో ఆరోగ్యానికి హానికరమే. ఏ ఆహార పదార్థాలైనా.. వాటిని జాగ్రత్త చేయడంతోనే ఆరోగ్యం దాగి ఉంటుంది.


మాయబజార్ వీధిలో బండివద్ద పానీపూరీ తింటున్న యువకులు

ఈగలు వాలిన పదార్థాలు తింటే టైఫాయిడ్, విరోచనాలు బారిన పడి విలవిల్లాడే ప్రమాదం ఉంది.

చేతుల శుభ్రత ముఖ్యం..

ప్రతి వ్యక్తి తన ఆరోగ్యం తన చేతుల్లోనే ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవడం లేదు. ఆహార పదార్థాలను తినేముందు.. చేతుల శుభ్రత పాటించకపోతే అతి ప్రమాదకరమైన అతిసార వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అపరిశుభ్రమైన చేతులతో ఆహారం తింటే జలుబు, అతిసారం, హైపటైటిస్-ఏ కంటి సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో బాధపడే అవకాశం ఉంది. మల మూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రత లేకుండా ఆహారం తింటే మరింత అనారోగ్యానికి గురికావాల్సి వస్తుంది.

నీరు,ఆహారంలో జాగ్రత్త పాటించాలి : డాక్టర్ ఓగూరి కోటయ్య



జూన్ నుంచి అక్టోబరు వరకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉందని సీనియర్ వైద్యులు ఓగూరి కోటయ్య తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వైరల్ ఫీవర్లతో బాధ పడుతున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తాగే నీరు, తీసుకునే ఆహారం పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులను తట్టుకునేందుకు ఆకు కూరలు, డ్రై ఫ్రూట్స్, గుడ్లు, పాలు, పండ్లు వంటి బలమైన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.



ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన డాక్టర్ కోడెల

● సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల అభివృద్ధికి కృషి
● నేడు 6వ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు

సత్తెనపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసన సభ స్పీకర్‌గా పని చేసిన డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజక వర్గాల్లో ప్రజా సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారు. రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్నారు. నకరికల్లు మండలం కండ్లకుంటలో 1947 మే 2న కోడెల శివప్రసాదరావు జన్మించారు. వైద్యుడిగా, రాజకీయ నాయకుడిగా పల్నాడు ప్రాంతంలో.. పల్నాడు పులిగా ప్రజల్లో ముద్ర వేసుకున్నారు. 2014లో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్ మొట్టమొదటి స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. సత్తెనపల్లి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో తారకరామ సాగర్‌ను నిర్మించి ఎన్‌టీఆర్ పార్కును, వావిలాల ఘాట్‌ను నిర్మించారు. తారక రామ సాగర్‌లో 46 అడుగుల ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తారక రామ సాగర్ చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి నియోజక వర్గంలో.. స్వచ్ఛ సత్తెనపల్లి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి మరుగు దొడ్లను నిర్మించే కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు. చేతుల శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి యునెసెఫ్ నుంచి అవార్డు పొందారు. సత్తెనపల్లి నియోజకవర్గం విద్యాభివృద్ధిలో భాగంగా కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయించారు. నియోజక వర్గంలోని అన్ని మతాలకు చెందిన శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో మోడల్ పోలీసు స్టేషన్‌ను నిర్మించారు. ముస్లింల కోసం షాదీఖానాను నిర్మించి, రాష్ట్ర స్థాయి అగ్నిమాపక శిక్షణా కేంద్రాన్ని సత్తెనపల్లిలో ఏర్పాటు చేయించారు. 50 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. రోగులకు వైద్య సేవలు అందేలా కృషి చేశారు. సత్తెనపల్లి పట్టణంలో రోడ్డు అభివృద్ధి చేయించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూశారు. రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేడియం అభివృద్ధికి కూడా ఎంతగానో కృషి చేశారు. 2014 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా సమర్థంగా సభను నడిపించారు. రాష్ట్ర విభజన అనంతరం కొత్త అసెంబ్లీని ఏర్పాటు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. స్పీకర్‌గా ఉన్న సమయంలో నిత్యం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారు. సత్తెనపల్లి నియోజక వర్గ ప్రగతికి ఆయన చేసిన కృషి ఎవ్వరూ మరువ లేరు. పక్కనే నరసరావుపేట నియోజక వర్గ అభివృద్ధికి కూడా ఆయన ఎంతో కృషి చేశారు. 2018లో రాష్ట్రస్థాయి మునిసిపల్ అధికారులు నరసరావుపేటను మోడల్ టౌన్‌గా ప్రకటించారు. కోటప్పకొండ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. 2015లో నరసరావుపేట మునిసిపాలిటీలో వంద సంవత్సరాల వేడుకలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలసి నిర్వహించారు. 1983లో తెలుగుదేశం పార్టీ ద్వారా నరసరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1985, 1994, 1999లో కూడా నరసరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్ర హోం మంత్రిగా, పంచాయతీ రాజ్ శాఖ మంత్రిగా, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా పని చేశారు. 2019 సెప్టెంబరు 16న ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. కోడెల శివ ప్రసాదరావు రాజకీయ స్ఫూర్తి ఎంతో మంది రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుంది. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పని చేసిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆరవ వర్ధంతి నేడు సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో పార్టీ నాయకులు, అభిమానులు భారీ ఎత్తున నిర్వహించనున్నారు.

ర్యాంకుల శ్యామల..

డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలకు ఎంపిక


మారుపూడి శ్యామల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన మారుపూడి శ్యామల మూడు విభాగాల్లో ఉద్యోగానికి అర్హత సాధించింది. స్కూల్ అసిస్టెంట్ విభాగం బయాలజికల్ సైన్స్‌లో జిల్లాలో 17వ ర్యాంకు, పీజీటీ బోటని విభాగంలో 29వ ర్యాంకు, పీజీటీ బయోలాజికల్ సైన్స్ 59వ ర్యాంకును సాధించింది. ఈడబ్ల్యూఎస్ కోటా కింద బయోలాజికల్ సైన్స్‌లో జిల్లాలో మూడవ ర్యాంకును శ్యామల సాధించింది. ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైన శ్యామల బయోలాజికల్ సైన్స్ ఉద్యోగాన్ని ఎంపిక చేసుకున్నట్లు తెలిపింది. ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన ఆమెను పొన్నూరు వాసులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

గురువు నేర్పిన సిలబస్‌తో.. రాష్ట్రస్థాయి 2వ ర్యాంక్


షేక్ మీర్జా

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో పీజీటీ(గణితం) పోస్టు కోసం నిర్వహించిన నియామక పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సెలెక్టెడ్ లిస్ట్‌లో షేక్ మీర్జా బీసీ ఈ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. మీర్జా తండ్రి రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కాగా తల్లి గృహిణి, సామన్య కుటుంబంలో జన్మించి ఈ ఘనత సాధించిన మీర్జాకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. బీసీ-ఈ కోటాలో జోన్ 3లో మొదటి ర్యాంక్ సాధించిన షేక్ మీర్జా రాష్ట్రంలో బీసీ-ఈ కోటాలో రెండవ స్థానంలో, మొత్తం రాష్ట్ర స్థాయి మెరిట్‌లో 135వ ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీషు మీడియంలో గణితం సబ్జెక్టుగా పరీక్ష రాసిన వారిలో ఆయన ఈ ఘనత సాధించారు. ఈ సందర్భంగా మీర్జా మట్లాడుతూ తనకు ఇంటర్మీడియట్‌లో విద్యనేర్పిన గురువు చందు పాపారావుని గుర్తు చేసుకున్నారు. తన గురువు నేర్పిన సిలబస్ తన విజయానికి సహాయపడిందని అన్నారు.

నిర్మించారు.. నిర్వహణ మరిచారు..

● నిరుపయోగంగా అగ్రి టెస్టింగ్ ల్యాబ్
● నష్టపోతున్న రైతులు


నిరుపయోగంగా ఉన్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్

మాచర్ల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందాన తయారైంది మాచర్ల నియోజకవర్గ రైతుల పరిస్థితి. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు ఏర్పాటు చేసిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిరూపయోగంగా మారింది. దీంతో రైతులు తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.. దీనిపై సరైన అవగాహన లేని రైతులు డీలర్లు ఇచ్చిన విత్తనాలనే వినియోగించి పంటలు సాగు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

రూ. 55 లక్షలతో నిర్మాణం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2022లో రూ. 55 లక్షలతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం చేపట్టారు. ఈ ల్యాబ్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకొని వినియోగించుకోవచ్చు. అధునాతన హంగులతో భవన నిర్మాణం కూడా పూర్తయింది. 2023లో అట్టహాసంగా ప్రారంభించారు. అయితే భవనంలో అవసరమైన హాట్ ఎయిర్ ఓవెన్, అనలిటికల్ బ్యాలెన్స్, వాక్యూమ్ పంపు, వాటర్ బాత్ షేకర్ వంటి సామగ్రిని ఏర్పాటు చేయలేదు. సిబ్బంది నియామకం కూడా జరపలేదు. దీంతో రెండేళ్లుగా ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రైతులకు అందుబాటులోకి రాలేదు. రైతుల అభివృద్ధికి పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

పరికరాలు అందుబాటులోకి రాగానే...

అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన సామగ్రి అందుబాటులోకి రాలేదు. అవి రాగానే ల్యాబ్‌ను నిర్వహిస్తాం. పరికరాలు లేకపోవడం వల్ల నాణ్యతా పరీక్షలు ప్రారంభం కాలేదు. ల్యాబ్‌లో సామగ్రి ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.


అరవింద వారధి వద్ద కృష్ణానది ప్రవాహం

కొనసాగుతున్న వరద ప్రవాహం

● వరద నీటిలోనే తల్లిదండ్రులతో ఇళ్లకు విద్యార్థులు

కొల్లూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది వరద ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. గాజుల్లంక వద్ద చిన్నరేవులోకి వరద నీరు ప్రవహిస్తూ దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంక చప్టాపైకి పారుతోంది. పాఠశాలలకు వెళ్లే తమ పిల్లల కోసం లంక గ్రామాల్లోని తల్లిదండ్రులు దోనేపూడి వచ్చి.. చప్టాపై ప్రవహిస్తున్న వరద నీటిలోనే ఇళ్లకు తీసుకెళ్తున్నారు. వరద చప్టాలపై వెళ్తున్న సమయంలో అక్కడ రాకపోకలు జరగకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ, అక్కడ ఎవరూ కానరావడం లేదు. కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలు, పులిచింతలతో పాటు వాగులు, వంకలు ద్వారా 3.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. 3.97 లక్షల క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీ నుంచి విడుదలైతే మొదటి ప్రమాద హెచ్చరిక, 5.67 లక్షలు క్యూసెక్కులు విడుదల చేస్తే రెండవ ప్రమాద హెచ్చరిక అధికారులు జారీ చేస్తారు. ప్రస్తుతం వరద ప్రవాహం నిలకడగా ఉందని మొదటి ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవసరం లేదని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు.


వరద నీటిలో పాఠశాల నుంచి పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

పోలీస్ వర్గాల్లో.. కలకలం

● వైసీపీ హయాంలో పల్నాడులో బరితెగించిన పోలీసులు
● కారుతో ఢీ కొట్టి టీడీపీ నేత జల్లయ్య హత్య
● కేసు విచారణ తారుమారు చేసిన ఇద్దరు సీఐల సస్పెన్షన్
● నిందితులను తప్పించడమే కాదు... హతుని బంధువులే నిందితులుగా కేసు



గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పల్నాడులో కళంకిత సీఐల సస్పెన్షన్ వ్యవహారం పోలీసు వర్గాల్లో సంచలనం సృష్టించింది. గత వైసీపీ హయాంలో జరిగిన టీడీపీ నేతల హత్యల్లో అత్యధిక ఘటనల్లో ప్రత్యక్షంగానో లేదంటే పరోక్షంగానో పోలీసుల ప్రమేయం ఉందనేది బహిరంగ రహస్యమే. నాడు టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గూండాలు దారుణంగా మతమార్చిన కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. ఈ కేసు విచారణను తారుమారు చేసిన ఇరువురు సీఐలు షమీవుల్లా, జయకుమార్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.... 2022 జూన్ 3న దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హత్య చేశాయి. ఈ కేసులో పోలీసులు నిందితులను వదిలేయడమే కాకుండా అతడి బంధువులనే నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. పల్నాడులో గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన అరాచకాలు, హత్యలపై ఆంధ్రజ్యోతి వరుసగా ప్రచురించిన కథనాలపై ప్రభుత్వం స్పందించింది. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణలో అప్పటి మాచర్ల రూరల్ సీఐ షమీముల్లా, కారంపూడి సీఐ జయ కుమార్‌లు కరుడుగట్టిన వైసీపీ ఫ్యాక్షనిస్టుల మాదిరిగా వ్యవహరించి కేసు విచారణనే తారుమారు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో వారిరువురిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం షమీవుల్లా ఒంగోలు డీటీసీలో, జయకుమార్ బాపట్ల ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో విధులు నిర్వహిస్తున్నారు. అంతేగాక ఈ కేసులో అప్పటి గురజాల డీఎస్పీ జయరామ్ ప్రసాద్, పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిలపై కూడా చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏకంగా హత్య కేసులో నిందితులను తప్పించడమే కాకుండా హతుని బంధువులనే నిందితులుగా పెట్టారంటే సంబంధిత ఉన్నతాధికారులకు తెలియకుండా జరిగే అవకాశమే ఉండదనే వాదన పోలీస్ వర్గాల నుంచే వినిపిస్తోంది.

హత్య కేసులో నిందితులు సాక్షులుగా...

సాక్షులు నిందితులుగా

సినిమాల్లో కూడా చూడని, ఊహకందని రీతిలో పల్నాడులో పోలీసులు పట్టపగలు జరిగిన దారుణ హత్య కేసులో నిందితులను సాక్షులుగా, సాక్షులను నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదు చేసి పోలీసులు ఏ స్థాయికి దిగజారి ప్రవర్తించారో అర్థం చేసుకోవచ్చు. చంద్రయ్య తరహాలోనే పల్నాడులో జరిగిన జల్లయ్య హత్య కూడా సంచలనం సృష్టించింది. చంద్రయ్య హత్య జరిగిన ఆరు నెలలకు అంటే 2022 జూన్ 3న జంగమహేశ్వరపాడుకు చెందిన టీడీపీ నేత జల్లయ్యను వైసీపీ గుండాలు దారుణంగా హతమార్చారు. దీనిలో భాగంగానే దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన గ్రామ టీడీపీ నాయకుడు జల్లయ్య గ్రామాన్ని వదిలి గురజాల పరిధిలోని మాడుగులలో తలదాచుకుంటున్నాడు. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం జల్లయ్యను హతమార్స్తే తమకు ఎదురుండదని వైసీపీ నాయకులు భావించారు. అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ప్రధాన అనుచరుడైన జంగమహేశ్వరపాడుకు చెందిన రౌడీషీటర్ మన్నెయ్య, ఆయన సోదరులు జల్లయ్యను హతమార్చేందుకు అప్పటికే సిద్ధమయ్యారు. ఇదిలాఉంటే 2022 జూన్ 3న జల్లయ్య రావులాపురం గ్రామంలో జరుగుతున్న తన అన్న కుమార్తె వేడుకకు వస్తుండగా సమాచారం తెలుసుకున్న వైసీపీ నాయకులు, పిన్నెల్లి ప్రధాన అనుచరుడైన మన్నెయ్య నేతృత్వంలో జంగమహేశ్వరపాడు శివారు కాకిరాల అటవీ ప్రాంతంలో దారి కాచి కత్తులతో పొడిచి దారుణంగా హత మార్చారు. ఈ హత్య కూడా తీవ్ర సంచలన సృష్టించింది. అయితే ఈ హత్యకు పాల్పడిన మన్నెయ్య, మరి కొందరిపై హత్య కేసు బనాయించకపోగా జల్లయ్యతో పాటు ఉండి ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సాక్షులైన జల్లయ్య మేనమామలనే నిందితులుగా కేసు నమోదు చేశారు. ఎంత దారుణమంటే హత్య కేసులో నిందితులను తప్పించి, సాక్షులనే నిందితులుగా కేసు నమోదు చేశారు. అంతేగాక జల్లయ్యను హత్య చేసిన నిందితులనే ఈ కేసులో సాక్షులుగా పేర్కొనడం నాటి దారుణాలకు పరాకాష్టగా చెప్పవచ్చు. అంతేకాదు జల్లయ్యను హత్య చేయబోతున్నారనే విషయం పోలీసులకు కూడా ముందుగానే తెలుసనేది బహిరంగ రహస్యమే.

పిన్నెల్లి సోదరుల అండతో రెచ్చిపోయిన పోలీసులు

పల్నాడు లో జరిగిన వరుస హత్యలకు నాటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డిల పరోక్ష పాత్ర ఉన్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి సోదరులు గడిచిన ఐదేళ్ల అరాచకాలకు తెగబడ్డారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు సామాన్య ప్రజానీకాన్ని సైతం భయభ్రాంతులకు గురి చేశారు. ఈ క్రమంలో అప్పట్లో జరిగిన హత్యలతో పాటు హత్యాయత్నాలు దాడులు, లూటీలపై కేసులు కూడా నమోదు కాలేదు. సంచలనం సృష్టించిన ఘటనలపై కేసులు నమోదైనప్పటికీ ఎటువంటి దర్యాప్తు జరగలేదు. చంద్రయ్య, జల్లయ్య లాంటి సంచలనం సృష్టించిన హత్య కేసుల్లోనూ విచారణ తూతూ మంత్రంగా సాగింది. ఈ నేపథ్యంలో నాటి చంద్రయ్య హత్యను పునర్విచారణ జరిపించాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇప్పటికే ఈ కేసును సీఐడీకి అప్పగించింది. జల్లయ హత్యతోపాటు పల్నాడు ప్రాంతంలో జరిగిన అనేక హత్యలు, హత్యాయత్నాలు లూటీలు, దాడులకు సంబంధించిన ఘటనలపై కూడా ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని పల్నాడు ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీని అందజేస్తున్న మన్నెం శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

టీటీడీ ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరికి చెందిన మన్నెం శ్రీనివాసరావు, అరుణ దంపతులు తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి విరాళం డీడీలను అందజేశారు. వారి కుమార్తెలు మన్నెం హారిక పేరిట ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల 116లు, మన్నెం హరిత పేరిట ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.10లక్షల116లు విరాళమిచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, మన్నెం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరులో జాతీయ మీడియా ప్రతినిధులు

● రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభం
● వెంగళాయపాలెం, మిర్చి యార్డుల సందర్శన


చింతలపూడిలో పర్యటిస్తున్న జాతీయ మీడియా బృంద సభ్యులు

గుంటూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖల సహకారంతో రాష్ట్రంలో మూడు రోజుల జాతీయ మీడియా పర్యటనను సోమవారం ప్రారంభమైంది. ఈ పర్యటన ప్రముఖ జాతీయ, ప్రాంతీయ మీడియా నిపుణులను ఒక చోట చేర్చి, వినూత్నమైన అట్టడుగు స్థాయి పాలనా కార్యక్రమాల అమలును పరిశీలించి.. నివేదించడానికి వీలు కల్పిస్తుంది. మీడియా ప్రతినిధి బృందానికి పత్రికా సమాచార కార్యాలయం (పంచాయతీ రాజ్) డీడీ అదితి అగర్వాల్ నేతృత్వం వహిస్తున్నారు.

వెంగళాయపాలెంలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ సందర్శన

తొలి రోజున మొదటిగా గుంటూరు గ్రామీణ మండలంలో ఉన్న వెంగళాయపాలెం గ్రామ పంచాయతీలోని స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్ట్ అమలును జర్నలిస్టులు పరిశీలించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ప్రారంభించిన స్వచ్ఛ రథం అనేది ఒక మొబైల్ యూనిట్ గృహాల నుంచి ఉత్పన్నమయ్యే స్క్రాప్, వ్యర్థ పదార్థాలను మార్పిడి చేసుకుని, సమాన బరువు కలిగిన రోజువారి నిత్యావసరాలను అందిస్తుంది. గ్రామ స్థాయిలో వ్యర్థాల విభజనను ప్రోత్సహించి స్థిరమైన పారిశుధ్యాన్ని ప్రోత్సహించడమే ఈ చొరవ లక్ష్యం. దీని గురించి అన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

ఆసియాలోనే అతిపెద్ద మిర్చి యార్డ్ సందర్శన

మీడియా బృందం గుంటూరులోని ఆసియాలోనే అతిపెద్ద మిర్చి మార్కెటింగ్ యార్డ్‌ను సందర్శించింది. అక్కడ వారు మిర్చి యార్డ్ కార్యదర్శి చంద్రికతో సంభాషించి, క్షేత్రస్థాయి వాణిజ్య, మార్కెటింగ్ కార్యకలాపాలతో పాటుగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతుందో తెలుసుకున్నారు. మిర్చి వేలం ఎలా జరుగుతుంది, ఈనామ్ అమలు తదితర విషయాలను అడిగి తెలుసుకొన్నారు. మధ్యాహ్నం, మీడియా బృందం చింతలపూడి గ్రామ పంచాయతీకి చేరుకుని అక్కడ స్వామిత్వ పథకం అమలు గురించి తెలుసుకున్నారు. ఈ చొరవ గ్రామీణ నివాసితులకు చట్టబద్ధమైన ఆస్తి హక్కులను అందిస్తుంది, వారు సంస్థాగత రుణాన్ని పొందటానికి, భూమిని మానిటైజ్ చేయడానికి, వివాదాలను తగ్గించడానికి వీలు కల్పిస్తుంది. ఈ పథకం వారి ఆర్థిక స్థిరత్వాన్ని, భూ యాజమాన్య భద్రతను ఎలా మెరుగుపరిచిందో లబ్ధిదారులు తెలుపుతూ ప్రభుత్వానికి వారి కృతజ్ఞతను వ్యక్తం చేశారు. ఈ సందర్శనలో పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తాజా ఏఐ-ఆధారిత సాధనమైన సభాసార్‌ను గ్రామసభలో ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరణ పొందారు. ఈ పర్యటనలో పంచాయతీ రాజ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తోట చందన, అధికారులు, సిబ్బంది, స్థానిక కమ్యూనిటీ నాయకులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలియజేయండి...

పెదనందిపాడు,సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గుంటూరు చానల్ విస్తరణకు భూమిసేకరణకు సంబంధించిన భూయజమానులు ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దార్ హేనాప్రియ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రావిపాడు, జీజీపాలెం గ్రామాల్లో గ్రామసభ నిర్వహిస్తామని, ఈ సభలో ఆర్డీవో పాల్గొంటారని ఆయా గ్రామాల రైతులు భూవివరాలు సేకరించి గ్రామసచివాలయ నోటీసు బోర్డుల్లో ప్రచురించినట్లు తెలిపారు. భూయజమానులు సమస్యలు ఉంటే గ్రామసభలో అర్జీ రూపంలో అందజేయాలని తెలిపారు.

సంక్షిప్తం..

● దుగ్గిరాల: ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 4012 క్యూసెక్కుల నీరు సోమవారం విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉండగా దిగువకు 2,33,970 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు నీటివిడుదల నిలిపివేశారు. రేపల్లెకాల్వకు 1447, తూర్పుకాల్వకు 376, పశ్చిమకాల్వకు 196, నిజాంపట్నంకాల్వకు 396, కొమ్మమూరుకాల్వకు 2780 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

● స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 373 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,350, గరిష్టధర రూ.10,225, మోడల్‌ధర రూ.10,000 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్టధర రూ.9,350, గరిష్టధర రూ.10,561, మోడల్‌ధర రూ.10,000 పలికాయి.

● తాడేపల్లి టౌన్: ఈ నెల 25న కృష్ణా జిల్లా గొల్లపూడిలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డి పోటీల్లో పాల్గొనే గుంటూరు జిల్లా బాలబాలికల జట్లను తాడేపల్లి గుడ్ న్యూస్‌స్కూల్‌లో జరిగిన సెలక్షన్స్ ట్రయల్స్‌లో ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, అజయ్‌లు తెలిపారు. కార్యక్రమంలో సుబ్బరాజు, అర్జునరావు, రాష్ట్ర వ్యాయామఉపాధ్యాయ అధ్యక్షుడు బి కరిముల్లా చౌదరి, పీడీలు పాల్గొన్నారు.

● డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటోడ్రైవర్‌కు వాహనమిత్ర అమలుచేయాలని సీఐటియూ నేత, తాడేపల్లి ఆటోవర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం మణిపాల్ ఆసుపత్రి ఆటోస్టాండ్ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో యూనియన్ కార్యదర్శి చిన్నారావు, ఏసుబాబు, శర్మ, రాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

● రాబోయే కాలంలో వేతనాల పెంపుకోసం ఆశావర్కర్లు పోరాటాలకు సిద్ధం కావాలని యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి పట్టణం ప్రకాష్‌నగర్ సీఐటియూ కార్యాలయంలో డ్రైవర్‌కాలనీ పీహెచ్‌సి పరిధిలోని ఆశావర్కర్ల మహాసభ జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వేముల దుర్గారావు, విజయలక్ష్మి, జ్యోతి, బేబి, రేణుక, కరుణకుమారి, విజయశ్రీ పాల్గొన్నారు.

● కాకుమాను: నవసమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని ప్రముఖ పారిశ్రామికవేత్త యార్లగడ్డ అంకమ్మచౌదరి కొనియాడారు. మండలంలోని కొండపాటూరు ప్రభుత్వపాఠశాలలో హిందీ ఉపాధ్యాయుని, ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు గ్రహీత చందా ప్రమీలాదేవి సన్మాన కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ప్రమీలాదేవి ఎంపిక కావడం హర్షనీయం అని ఎంఈవో కెన్నడీ అన్నారు. కార్యక్రమంలోప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాశరావు, శీలం అంకారావు, రాఘవరావు పాల్గొన్నారు.

● పెదనందిపాడు: స్థానిక కొల్లా వెంకయ్య గ్రంథాలయంలో మాజీ ఎంపీ, ఎమ్మెల్యే కొల్లా వెంకయ్య 27వ వర్ధంతి సందర్భంగా సోమవారం విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్‌పోటీలు నిర్వహించారు. మంగళవారం ప్లాస్టిక్‌తో ప్రమాదం ఏమిటి, ప్లాస్టిక్ వాడకం ఎలా ఆపాలి అనే అంశంపై డిబేట్, శ్రీశ్రీ గేయాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా మక్కెన జవహర్ రాణి వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు, రామన్ పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి ఘట్కా పోటీలకు శ్రీనివాసా సీబీఎస్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శాంతకుమారి సోమవారం తెలిపారు. అండర్ 17లో ఎం ప్రజ్వల్, జి శైలజ, ఆర్ హిమతేజలు పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

● మండలంలోని అన్నపర్రులో పిడుగుపాటుకు గురై మృతిచెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు ఎంపీటీసీ కల్లూరి నాగేశ్వరరావు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.కిరణ్‌కుమార్‌తో కలిసి మృతుల కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రు.10వేలు చొప్పున నగదు అందజేశారు.

● ప్రత్తిపాడు: వ్యర్థాలను వేరుచేయడంపై మండలంలోని తుమ్మలపాలెం సుప్రీమ్ ఎల్‌టీసీ సెంటర్‌లో రెండురోజుల నిర్వహించే శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. శిక్షణకు ప్రత్తిపాడు, కాకుమాను, గుంటూరు రూరల్, ఫిరంగిపురం, తాడికొండ మండలాల కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, సర్పంచ్ నాగమల్లేశ్వరి, డీపీఆర్‌సీ సిబ్బంది, పీఎస్ ఖాజ, ఉమామహేశ్వరి, డబ్బూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● తుళ్లూరు: తుళ్లూరులో 30 పడకల ఆస్పత్రికి వైద్యసిబ్బందిని నియమించి ల్యాబ్ పరికరాలు అమర్చాలని కోరుతూ.. ఆరోగ్య మంత్రికి పంపటానికి తుళ్లూరులో సోమవారం సంతకాల సేకరణ జరిగింది.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



మేడికొండూరు: రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న డైరెక్టర్ తిలక్‌బాబు



ఆర్‌వీఆర్‌జేసీలో విద్యార్థులు ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శన



తాడికొండ: పంచాయతీరాజ్ శాఖ మాజీ చీఫ్ ఇంజనీర్ బ్రహ్మయ్యను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాసరావు, అధ్యాపకులు



వట్టిచెరుకూరు: కిట్స్ కళాశాలలో ఎంఆర్ మొహిద్దీన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్

దుగ్గిరాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్‌డే వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కళాశాలలోని ఆయన విగ్రహానికి ప్రిన్సిపాల్ ఎస్.లక్ష్మీనారాయణ, జీవన్‌కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ ఆనందబాబు, సరోజిని, జీఎస్‌ఆర్, లలితబాబు, శ్రీనివాసరావు పూలమాలలువేసి నివాళులర్పించారు.

● గుంటూరు: బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినులకు వివిధ విభాగాల లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ కేవీకే రావు మాట్లాడుతూ విద్యార్థినులు నిత్యం కొత్త ఆవి ష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డేవిడ్ సాల్మన్, అకడమిక్ డీన్ డాక్టర్ రూపేష్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

● గుంటూరు(విద్య): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీలో సోమవారం ఇంజనీరింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగం దేశ ఆర్థిక,సాంకేతిక ప్రగతికి వెన్నెముక అన్నారు. విశ్వేశ్వరయ్య కృషి నేటికీ, భవిష్యత్ యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కాకుమాను: మేధోసంపత్తి కలిగిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు కాకుమాను మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా కార్యాలయంలో వేడుకలుజరిపారు. కార్యక్రమంలో మండలంలోని ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● వట్టిచెరుకూరు: విశ్వేశ్వరయ్య నిబద్ధత అనుసరణీయమని రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎంఆర్ మొహిద్దీన్ అన్నారు. వింజనంపాడు పరిధిలోని కిట్స్ కళాశాలలో ఇంజనీర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా మొహిద్దీన్, విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ బాబు, డైరెక్టర్ డాక్టర్ కే హరిబాబులు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు, వరదల సమయంలో నిరంతర సమస్యల పరిష్కారంలో దార్శనికత కలిగిన ఇంజనీర్ల అవసరం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఇంజనీరు మొహిద్దీన్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ బాబు, డైరెక్టర్ హరిబాబు ఘనంగా సన్మానించారు.

● తాడికొండ(మోతడక): ఇంజనీరింగ్, టెక్నాలజీ కలయికే ప్రకాశవంతమైన భారత్ భవిష్యత్తుకు మార్గమని పంచాయతీరాజ్‌శాఖ మాజీ చీఫ్ ఇంజనీర్ గుర్రం బ్రహ్మయ్య అన్నారు. సోమవారం ఇంజనీర్స్‌డే సందర్భంగా మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలును నిర్వహించారు. ముందుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాసరావు, డైరెక్టర్ డీ.వినయ్‌కుమార్, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వీ.వీ.సుబ్బారావు, డీన్ ఆఫ్ ఆర్ అండ్ డీ డాక్టర్ పీ.బాలమురళీకృష్ణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

● తాడికొండ(లాం): దేశాభివృద్ధిలో సాంకేతికతదే కీలకపాత్ర అని ఏపీఎస్‌ఈబీ మాజీ డీఈ వీ.వీ.సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం లాం చలపతి ఇంజనీరింగ్‌కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీరింగ్ డే వేడుకలను నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, బృంద చర్చలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, డైరెక్టర్ డీ.వినయ్‌కుమార్, డాక్టర్ ఏ.బాలజీ, డాక్టర్ కే.వీ.రామారావు, డాక్టర్ వీ.నాగగోపిరాజు పాల్గొన్నారు.

● మేడికొండూరు: మహోన్నత వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఆయన భావి ఇంజనీర్లకు ఆదర్శనీయమని ఎన్నారై కళాశాల డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు చెప్పారు. మేడికొండూరు సమీపంలోని ఎన్‌ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తిలక్ బాబు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సభకు ప్రిన్సిపల్ డి.సంజయ్ అధ్యక్షత వహించారు. విద్యార్థులు రక్తదానం చేశారు. 70 యూనిట్ల రక్తాన్ని శ్రీబ్లడ్ బ్యాంక్‌కి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి అధ్యాపకులు చంద్రమౌళి, నాగేశ్వరరావు, సౌజన్య, శ్రీదేవి హాజరయ్యారు. తొలుత వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు



రామకృష్ణకు నియామకపత్రం అందజేస్తున్న కేసన శంకరరావు

బీసీ హక్కుల సాధనకై అలుపెరుగని పోరాటం

● బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసం బీసీ సంక్షేమ సంఘం అలుపెరుగని పోరాటం చేస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం మన్యం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆవాల రామకృష్ణకు సోమవారం మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జిల్లా కమిటీలు సంఘం బలోపేతానికి, బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు జంజనం వరప్రసాద్, మేకా వెంకటేశ్వరరావు, టీ.బుచ్చిబాబు, అంపిల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర అంకవరప్రసాద్ సేవలు మరువలేనివి

మంగళగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో టీడీపీ బలోపేతానికి ఆరుద్ర అంకవరప్రసాద్ ఎనలేని సేవలందించారని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. టీడీపీ మంగళగిరి మండల మాజీ అధ్యక్షుడు స్వర్గీయ ఆరుద్ర అంకవరప్రసాద్ 11వ వర్ధంతి సందర్భంగా ఆరుద్ర యూత్ ఆధ్వర్యంలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో నేతలు ఆరుద్ర చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు పడవల మహేష్, పల్లబోతుల శ్రీనివాసరావు, నేతలు మున్నంగి శివశేషగిరిరావు, ఇబ్రహీం, పార్థసారథి, పిచ్చిరెడ్డి, రమేష్‌బాబు, పద్మ, షేక్ రియాజ్, దనుంజయరావు, దుర్గారావు, నాగరాజు, ఏసుబాబు, రవి, పెద్దబ్బాయ్, నాగరాజు, శ్రీనివాసరావు, మురళీమోహనరావు పాల్గొన్నారు. పార్కు రోడ్డులోని కార్యాలయంలో ఆరుద్రకు నివాళులర్పించారు.

చింతలపూడిలో స్వమిత్వ అమలుపై కేంద్ర బృందం అధ్యయనం



స్వమిత్వ అమలు గురించి తెలుసుకుంటున్న ఢిల్లీ బృందం

దుగ్గిరాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడిలో స్వమిత్వ సర్వే అమలు జరుగుతున్న తీరును ఢిల్లీ నుంచి వచ్చిన 16 మందితో కూడిన బృందం సోమవారం పరిశీలించింది. డీపీఓ సాయకుమార్, డీఎల్‌పీఓ స్వరూపరాణి, మండల సర్వేయర్ గోపాలరావు, గ్రామ సర్వేయర్లు గ్రామంలో స్వమిత్వ ద్వారా డ్రోన్ భూమి చిత్రాల సేకరణ, రోవర్ ద్వారా సరిహద్దు పాయింట్ల గుర్తింపు, నిర్ధారించిన కొలతలను బట్టి పన్ను విధించే విధానాన్ని తెలియజేశారు. ఢిల్లీ నుంచి ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ నిశాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణికంఠ పరిశీలన బృందానికి వివరించారు. ప్రస్తుతం రెండో విడత భూ-రీసర్వే జరుగుతుందని, నవంబరు నుంచి తుది విడత సర్వే ప్రారంభించి.. 2026 మార్చి నాటికి పూర్తిచేస్తామన్నారు. స్వమిత్వ సర్వే అనంతరం భూహక్కు పత్రాలను అందిస్తామన్నారు. పంచాయతీరాజ్ ఏడీ మహేష్, స్వమిత్వ ఏడీ చందన గ్రామంలో కంపోస్ట్ తయారీ వరకు చేపడుతున్న పారిశుధ్య, దోమల నివారణ చర్యలు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు అంశాలను బృందం అధ్యయనం చేసింది.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. రూరల్ మండలం, వెంగళాయపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్, రైతు సేవ కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. అధికారంలో రాగానే కూటమి ప్రభుత్వం గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే వెంగళాయపాలెంలో దాదాపు రూ.2కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్, ఆర్‌ఎస్‌కే, ఇతర నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కల్లూరు శ్రీనివాసరావు, ఇమ్మడి మల్లికార్జున రావు, గంధం సురేష్, కల్లూరి అవినాష్. మాధవి, గ్రామ సర్పంచ్ లలితకుమారి, విద్యుత్ ఎస్‌ఈవో రమేష్, ఈఈవో టి శ్రీనివాస్‌బాబు, రమేష్, ముప్పాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ జిల్లా జట్టులో సత్యసాయి విద్యార్థులు

తాడికొండ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్ టెన్నిస్ గుంటూరు జిల్లా అండర్-14, 17 బాలబాలికల జిల్లా జట్లకు తాడికొండ శ్రీసత్యసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రాయపాటి సాయిమోహన్‌కృష్ణ పేర్కొన్నారు. సోమవారం గుంటూరులోని బీ.ఆర్.స్టేడియంలో స్కూల్ గేమ్స్ అఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సాఫ్ట్ టెన్నిస్ అండర్ 14, అండర్-17 బాలబాలికల జిల్లా జట్లకు ఎంపికలు జరిగాయి. జిల్లా జట్టులో చోటు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సీఈవో డాక్టర్ కుర్రా అమలా, ప్రిన్సిపాల్ కృపాకర్, పీ.డీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ఇంటింటి సర్వే

ఫిరంగిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వేములూరిపాడులో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి తిరిగి వైద్య సిబ్బంది రక్తపూతలు తీశారు. గ్రామ కార్యదర్శి జోత్స్న, పంచాయతీ కార్మికులతో కలసి గ్రామంలోని మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్త, పిచ్చి మొక్కలు తదితరాలను తొలగింప చేశారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ కే బాబూరావు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం రేపు

మేడికొండూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ కె. ప్రభాకరరావు సోమవారం తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న, జరగవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై ఎంపీపీ మన్నవ స్వప్న అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సమావేశానికి సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు నివేదికలతో హాజరు అవుతారని ఆయన వివరించారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న కల్నల్ దీపక్ కుమార్ శర్మ



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో సోమవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరులోని 25 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్‌సీసీ వలన విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, సానుకూల దృక్పథం, సమాజంలో ఇతరులతో ఎలా మెలగాలో నేర్చుకుంటారని తెలిపారు. విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులు స్వేచ్ఛగా విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తితే మమ్మల్ని నేరుగా సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రెర రాష్ట్ర ఛైర్మన్ శివారెడ్డికి అభినందనలు

ఫిరంగిపురం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రెర రాష్ట్ర ఛైర్మన్‌గా ఫిరంగిపురానికి చెందిన ఆరె శివారెడ్డి నియామకంపై టీడీపీ మండల కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు మండవ నరసింహారావు మాట్లాడుతూ శివారెడ్డి గతంలో రాష్ట్ర క్రెడాయ్ ఛైర్మన్‌గా రెండు పర్యాయాలు, జాతీయ క్రెడాయ్ కార్యదర్శిగా పని చేశారన్నారు. అమరావతి జేఏసీ కన్వీనర్‌గా కూడా పని చేశారని తెలిపారు. అమరావతి ఉద్యమానికి నాయకత్వం వహించి శ్రమించారన్నారు. కార్యక్రమంలో ఫిరంగిపురం సొసైటీ అధ్యక్షులు కటికల రామకోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి బంధనాథం సతీస్, పట్టణ అధ్యక్షులు కే అప్పారావు, జెట్టి శ్రీనివాస్, పసల తోమాస్, పీ హృదయరాజు, గుండెగ జోజి తదితర నాయకులు పాల్గొన్నారు.

చేనేత పరిరక్షణకు ప్రత్యేక విధానాలు తేవాలి

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలను రూపొందించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన చేనేత అధ్యయన యాత్రను మంగళగిరి ఎన్నారై జైజంక్షన్ నేతన్న విగ్రహానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ ఈ యాత్ర ద్వారా క్షేత్రస్థాయిలో చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. చేనేత కార్మికులకు తగిన ప్రోత్సాహకాలు, ముడి సరుకులపై సబ్సిడీ, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి, సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, నేతలు బాలాజీ, బత్తూరి మోహనరావు, గజవల్లి వెంకట కృష్ణ, అన్నవరపు ప్రభాకర్ రావు, జాలాది జాన్‌బాబు, చిన్ని సత్యనారాయణ, నందం బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం గడపవచ్చని ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు కిశోరబాలికలు, వృద్ధులు అనారోగ్యంతో బాధపడేవారు తప్పనిసరిగా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కేఎల్‌యూ స్టూడెంట్స్ ఎఫైర్స్ డీన్ డాక్టర్ ప్రసాద్ సూచించారు. జాతీయ పోషకాహార వారోత్సవాల్లో భాగంగా మెల్లెంపూడిలో యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఏఐ అండ్ డీఎస్ విభాగం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పోషకాహారం వల్ల కలిగే లాభాలు, వాటి ప్రాముఖ్యతను ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వి జోనితిన్, ఫీల్డ్ కోఆర్డినేటర్ పి సురేష్, వలంటీర్లను వీసి సారథి వర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, రాజశేఖరరావు, వెంకటరామ్, డీన్లు డాక్టర్ హబిబుల్లా ఖాన్, ప్రభాకర్ తదితరులు అభినందించారు.

కేఎల్‌యూ ఆచార్యురాలికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

తాడేపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందిస్తున్న కేఎల్ యూనివర్సిటీ వ్యాల్యూ ఎడ్యుకేషన్ సెల్ ఆచార్యురాలు కొడుకుల శంకరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఏపీ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్, ప్రైవేట్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని కెన్నడి నెస్ట్ జనరేషన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పాన్ ఇండియా అవార్డు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సంవత్సరం దేశవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు వేలసంఖ్యలో ఈ అవార్డుకు నామినేషన్లు చేసుకోగా కేవలం 1000 మంది మాత్రమే ఎంపికయ్యారు. ఈ ఏడాది కేఎల్‌యూ ప్రొఫెసర్ శంకరి ఈ అవార్డు పొందారు. డాక్టర్ శంకరిని వర్సిటీ సిబ్బంది అభినందించారు.

ఆటో రిక్షా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సొంత వాహనదారులైన ఆటో రిక్షా/మోటారు క్యాబ్/ మాక్సి క్యాబ్ డ్రైవర్లకు రూ.15వేలు ఆర్థికసాయం కొరకు అర్హత గల వాహనదారుల నుండి ఈ నెల 16వ తేదీ నుండి 19 వరకు కొత్త దరఖాస్తులు స్వీకరించేందుకు, వీరితోపాటు 2023-24లో సొంత వాహనదారులై ఆర్థికసాయం పొందిన వాహనదారులందరూ వారి సచివాలయంలో వెల్ఫేర్ కార్యదర్శిని కలిసి సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందజేయాలని ఎంటిఎంసి కమిషనర్ అలీం బాషా సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడు ఆధార్ కార్డు కలిగి దారిద్ర్యరేఖకు దిగువన ఉండి రేషన్‌కార్డు కలిగి ఉండాలని, ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఉండాలని డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉంటే ప్రయోజనం పొందేందుకు అర్హులన్నారు.

స్మార్ట్ ఈట్ స్ట్రీట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలి

ఒక కుటుంబం - ఒక వ్యాపారవేత్త అనే నినాదంతో ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లి ప్రాంతం ప్రాతూరు రోడ్డులో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి గుడి నుండి కెఎల్‌యూకు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వరకు స్మార్ట్ ఈట్ స్ట్రీట్ ఏర్పాటుచేసి వీధి విక్రయదారుల వ్యాపార జీవనోపాధి కొరకు తాత్కాలికంగా 40 షాపులు ఏర్పాటుచేస్తున్నందున అర్హులైన వీధి విక్రయ వ్యాపారుల నుండి దరఖాస్తులు కోరుతున్నామని ఎంటిఎంసి కమిషనర్ అలీం బాషా ప్రకటనలో కోరారు. 18 ఏళ్ల పైబడిన వయోజనులు, వ్యాపారులు ఎంటిఎంసిలో స్ట్రీట్ వెండర్‌గా నమోదుదై ఐడీ కార్డు, స్ట్రీట్ వెండింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, స్ట్రీట్ వెండింగ్ ఐడి కార్డు, సర్టిఫికెట్ ఆధార్, పాన్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్సులు, మూడు ఫోటోలు సమర్పించాలని కమిషనర్ కోరారు. తాడేపల్లి అర్బన్, రూరల్ ప్రాంత పరిధిలోని వీధి విక్రయ వ్యాపారులు ఈ నెల 16 నుండి 25వరకు కమిషనర్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

17 నుంచి ఆరోగ్య శిబిరాల నిర్వహణ

తాడేపల్లి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వరకు స్వస్త్‌నారి స్వశక్తి పరివార్ అభియాన్ కింద ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.తాడేపల్లి పీహెచ్‌సీలో సెప్టెంబర్ 17న వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్టు పీహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ శాంతకుమారి తెలిపారు. శిబిరంలో మహిళలకు గుండెజబ్బులు, మధుమేహం, గర్భాశయ క్యాన్సర్, రక్తహీనత వంటి వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తారన్నారు. రక్తదాన శిబిరాలు, అవగాహనా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డాక్యుమెంట్లు పోయినవి

చల్లా కోటేశ్వరరావు S/o. చల్లా యలమంద, డోర్ నెంబర్ 14-84, పొన్నేకల్లు గ్రామం, తాడికొండ మండలం, గుంటూరు జిల్లాకి చెందిన కొనుగోలు ద్వారా సక్రమించినట్టి దస్తావేజు నెంబర్ **236/1974, 201/1979, 498/1982** కు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులను తీసుకొని పొన్నెకల్లు లోని మా ఇంటి వద్ద నుండి **25-8-2025**న బైక్ పై తాడికొండ గ్రామంలో గల రిజిస్టర్ ఆఫీసుకి సవరణ దస్తావేజు చేయుటకు వెళుతుండగా సదరు డాక్యుమెంట్లు మార్గమధ్యంలో పోయినవి ఎంత వెతికిన దొరికిన దొరకలేదు కావున దొరికిన వారు పై అడ్రస్ పంపగలరు...

చల్లా శివ
సెల్ : 7661006324

నాటి వైసీపీ పెద్దల పాపం.. నేడు రేషన్ లబ్ధిదారులకు శాపం

● ప్రత్తిపాడులోని 64 రేషన్ కార్డులు గొట్టిపాడుకు బదిలీ

● స్మార్ట్ కార్డుల పంపిణీతో బట్టబయలు

● ఎండీయూ వాహనదారులు, అధికారుల నిర్వాకం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తమ స్వలాభం కోసం గుట్టుచప్పుడు కాకుండా చేసిన పని ఇప్పుడు లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది. పూర్వం నుండి ఒకే గ్రామంలో నివాసం ఉండే కార్డులు ఏకంగా గ్రామం దాటాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి వైసీపీ పెద్దల నిర్వాకంతో అధికారులు గుడ్డిగా ఒక వలంటీర్ పరిధిలోని 64 రేషన్ కార్డులను గ్రామ పొలిమేరలు దాటించేశారు. ఎంచక్కా వారికి అనుకూలంగా చేసుకుని బియ్యాన్ని బొక్కేశారు. గత వైసీపీ హయాంలో రేషన్ బియ్యం పంపిణీకి ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టారు. ఆ సమయంలో వాహనదారులు, వలంటీర్ల ఇష్టారాజ్యంతో పంపిణీ జరిగింది. ఈ సమయంలో ప్రత్తిపాడు, గొట్టిపాడు ఇద్దరు, ముగ్గురు డీలర్ల పరిధిలో ఒక వాహనాన్ని ఏర్పాటుచేయగా.. అందులో ప్రత్తిపాడులోని ఒక వలంటీర్ పరిధిలోని 64 రేషన్ కార్డులను మొత్తాన్ని గొట్టిపాడులో కలిపేశారు. అందుకు అప్పటి అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఒక కార్డును గ్రామం మార్పించాలంటే తప్పకుండా కార్డుదారుల అనుమతి తప్పనిసరి. ఎండీయూ వాహనాలు వచ్చిన తరువాతనే ఈ తంతు జరిగింది. అప్పటి రెవిన్యూ అధికారులు వైసీపీ పెద్దల మాట విని కార్డులను గొట్టిపాడులోని మరో దుకాణానికి బదిలీ చేశారు. ఇప్పుడు ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తుండటంతో కార్డు దారులు తమ కార్డుల కోసం సమీప డీలర్‌ను సంప్రదించగా.. అవి తమ వద్దకు రాలేదని చెప్పడం, ఆ తరువాత గొట్టిపాడుకు చెందిన డీలర్ ఇక్కడకు ఆ కార్డులను పంపడంతో విషయంబట్టబయలైంది.



తమ రేషన్ కార్డులను ప్రత్తిపాడుకు మార్చాలంటూ తహసీల్దార్‌కు విన్నవించుకుంటున్న మహిళలు

పీజీఆర్ఎస్‌లో తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఈ క్రమంలో బాధిత కుటుంబాలకు చెందిన మహిళలు ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మీరు మరలా అడ్రస్ చేంజ్‌కు పెట్టుకోవాలని ఆయన సూచించారు. అందుకు మహిళలు తమకు సంబంధం లేకుండా కార్డులు ఎలా మార్చారంటూ ప్రశ్నిస్తున్నారు.

తుళ్లూరు మండల టీడీపీ అధ్యక్ష పదవి కోసం 8 మంది పోటీ

తుళ్లూరు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండల టీడీపీ అధ్యక్ష పదవి కోసం 8 మంది పోటీపడ్డారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు (పెదపరిమి), ప్రస్తుత అధ్యక్షుడు ధనేకుల వెంకటసుబ్బారావు(నేలపాడు), వెంకటపాలెం మాజీ సర్పంచ్ చేకూరి రవి, వాకచర్ల వీరాంజనేయులు(మందడం) బండ్ల పట్టాభిరామయ్య (తుళ్లూరు), కాకా నాగేశ్వరావు(దొండపాడు), మరో ఇద్దరు అధ్యక్ష పదవిని ఆశిస్తూ పరిశీలకులకు నివేదించారు. ఈ మేరకు సోమవారం గుంటూరు జిల్లా పార్టీ ఆఫీసులో పరిశీలకులు రాజా మాస్టారు, చిరుమామిళ్ల మధు కార్యకర్తల అభిప్రాయాలను స్వీకరించారు. నివేదికను అధిష్టానానికి పంపి అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు.

పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం

ప్రమోటింగ్ అధికారి నాగేంద్ర

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పరిశ్రమల ప్రమోటింగ్ అధికారి నాగేంద్ర తెలిపారు. ఉడా కాలనీలో ఎన్టీఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నమోదు ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని అనుమతులను త్వరితగతిన అందిస్తోందని, ఈ అవకాశం వినియోగించుకుని యువత పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మిషన్ మేనేజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

దరఖాస్తులు సకాలంలో పరిష్కరిస్తాం

● కమిషనర్ శ్రీకాంత్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌కు అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందించిన దరఖాస్తులు స్వీకరించారు. 28వ వార్డులో మురుగు కాల్వల నిర్మాణం, 3వ వార్డులో రహదారి నిర్మాణం, 16వ వార్డులో వీధి కుక్కల సమస్య, హౌస్ హోల్డ్ మ్యాపింగ్, పెన్షన్ సమస్యలపై అర్జీలు తీసుకున్నారు. అర్జీలను పరిష్కరించాలని శాఖాధికారులను ఆదేశించారు. ఏసీబీ వాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయానికి 15 దరఖాస్తులు

సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 15 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ 5, మున్సిపల్ 5, పోలీసు శాఖ 3, పంచాయతీరాజ్ 1, ఇరిగేషన్ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు అందిందని సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

పొన్నూరులో 7...

పొన్నూరు టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు 7ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ జియావుల్‌హక్ తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం జరిగింది. రెవెన్యూ సమస్యలపై 4, మండల పరిషత్ అధికారులకు1, సర్వే కోసం2 అర్జీలందాయి. పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE HON'BLE HIGH COURT OF A.P. AT: AMARAVATHI
I.A.No.2/2025 in I.A.No.2 / 2024 in Tr. AS No. 3828/2004

BETWEEN :
B.Rama Rao(Died) &Others ...Petitioners/Appellants
And
C. Viswanatham & Others. ...Respondents

To,
R-13:Yellapragada Meenakshi, W/o. Umanath.
R-14:Yellapragada Kanya Kumari, D/o. Narasimha Rao,Both are R/o.Door No.1-27-18/1,Nazarpet, Tenali, Guntur Dist.

పై కేసులో కోర్టువారు మరియు న్యాయవాది ద్వారా నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీ కోర్టు వారు ది.23-09-2025కి మీరు హాజరుకావలసినదిగా ఉత్తర్వులు జారీచేసియున్నారు. సదరు తేదిన ఉ.గం.10-30ని.లకు మీరు గాని, మీ తరపు న్యాయవాది గాని హాజరై మీ వాదనలు వినిపించ వలసినది. లేనిచో మీ పరోక్షమున కేసును తీర్మానించుట జరుగునని తెలియ జేయడమైనది.

కె. రామ చంద్ర, న్యాయవాది,
డోర్.నెం.8-1-68/ఎ/4,వినోబా నగర్, ఫేజ్-1, షేక్‌పేట, హైదరాబాద్-500104, సెల్: 9010550284.

నీట మునిగిన పంట పొలాలు

● ఉధృతంగా డ్రెయిన్లు



పెదకాకాని మండలంలో జలమయమైన పొలాలు

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నుంచి వస్తున్న వరద నీరు కారణంగా చేబ్రోలు మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు గుంటూరు నుంచి వచ్చే నల్ల డ్రెయిన్ మండలంలోని శలపాడు మీదగా నంగం జాగర్లమూడి వద్ద ఉన్న డ్రైన్‌లో కలుస్తుంది. ఈ క్రమంలో నంగం జాగర్లమూడి వద్ద నల్ల డ్రైన్ తూములు చిన్నవిగా ఉండటంతో వరద ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. గత రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే రైతులు మూడుసార్లు ఎద పద్ధతిలో నాటుకున్న వరి మునిగిపోయింది. దీంతో ఒక్కోరైతు వేలాది రూపాయలు నష్టపోయామని వాపోతున్నారు. కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని ఆందోళన చేస్తున్నారు. చేబ్రోలు మండలంలో వేజండ్ల, సుద్ధపల్లి, శలపాడు, శేకూరు, వీఎన్‌పాలెం గ్రామాల్లో జూలై నెలలో కురిసిన వర్షానికి సుమారు 550హెక్టార్లలో వరి పంట మునిగింది. వారానికి పైగా నీరు నిలువ ఉండడంతో నారుమడి కుళ్ళిపోయింది. దీనితో చేసేదిలేక రైతులు మరలా వరి విత్తనాలు నాటుకున్నారు. పది రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా గుంటూరు నుంచి వస్తున్న మురుగుతో డ్రెయిన్ నిండి ప్రవహిస్తోంది. పక్కనే ఉన్న జహంగీర్ వంతెన వద్ద కాలువ కట్ట మట్టి కోతకు గురై పంట పొలాలు నీట మునిగాయి. ఆదివారం రాత్రి గుంటూరులో కురిసిన వర్షానికి



చేబ్రోలు: వరద నీటిని పరిశీలిస్తున్న రైతులు

నల్ల డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే ఐదు రోజులుగా నీళ్లలో వరి నారుమడి నానుతోంది. మరో రెండురోజుల వ్యవధిలో నీళ్లు బయటకు వెళ్లకపోతే మూడోసారి కూడా నష్టపోతామని శలపాడు ప్రాంత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి విత్తనాలు అందజేయాలని కోరుతున్నారు.

చెరువులను తలపిస్తున్న పంట పొలాలు

పెదకాకాని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో నీట మునిగి పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు నీట మునిగి రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని నంబూరు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయపట్లపాలెం, గోళ్ళ మూడి గ్రామాల్లోని వేలాది ఎకరాల వరి పంట నీట మునిగింది. అదేవిధంగా ఉప్పలపాడు గ్రామంలోని జడ్పీ పాఠశాలలోకి భారీగా వరద నీరు చేరింది. పక్షుల కేంద్రానికి సంబంధించిన చెరువుకు కాంపౌండ్‌వాల్ నిర్మించకపోవడంతో చెరువులోని నీరంతా పాఠశాలలోకి వస్తున్నది. దీనిపై అటవీ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీటి కారణంగా ప్రతిరోజు విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.



నీటితో నిండిన ఉప్పలపాడు జడ్పీ పాఠశాల ఆవరణ

బీసీ సెల్ అధికార ప్రతినిధికి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ పరామర్శ



బీసీ సెల్ అధికార ప్రతినిధిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామానికి చెందిన తాటి శంకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సోమవారం నారాకోడురులోని తాటి శంకర్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాటి శంకర్ సేవలు పార్టీకి అవసరమన్నారు. పూర్తిగా కోలుకున్నాక పార్టీ కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

తెనాలి క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖకు చెందిన విజిలెన్స్, ఆపరేషన్ విభాగాలకు చెందిన అధికారులు సోమవారం తెనాలి డీ-2 సెక్షన్‌లోని జగ్గడిగుంటపాలెం, మల్లెపాడు, పెదరావూరు, సుల్తానాబాద్ ప్రాంతంలో విద్యుత్ మీటర్ల పరిశీలన చేశారు. ఈ పరిశీలనలో ఓ ఇంటి యజమాని విద్యుత్ మీటరు ఉన్నప్పటికీ విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుండగా అతనికి రూ.20వేలు అపరాధ రుసుం, మరోచోట అనుమతి పొందిన కేటగిరిలో కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుతున్న 42మందిపై రూ.3.14 లక్షలు వంతున మొత్తం రూ.3.52 అపరాధ రుసుం విధించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. తనిఖీలలో 58మంది అధికారులు, 126మంది సిబ్బంది కలిసి 58 బృందాలుగా ఏర్పడి మొత్తం 5185 విద్యుత్ సర్వీసులు తనిఖీలు చేసినట్లు అధికారులు తెలిపారు.

పెదరావూరులో ఎన్‌సీసీ ఆర్మీవింగ్ ప్రారంభం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పెదరావూరు హైస్కూల్‌లో సోమవారం ఎన్‌సీసీ ఆర్మీవింగ్‌ను ప్రారంభించారు. హెచ్‌ఎం సరళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత జాతీయ జెండా ఎగరవేసి వందనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కల్నల్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. ఎన్‌సీసీలో రాణించే విద్యార్థులకు పలు విభాగాల్లో పనిచేసే అవకాశం లభిస్తుందని, తద్వారా అందుకున్న సర్టిఫికెట్లు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యతో పాటు ప్రతి విద్యార్థికి మరొక అంశంలో ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 8వ తరగతిలో 25మంది విద్యార్థులను ఎంపికచేసి ఎన్‌సీసీ క్యాడెట్లుగా నియమించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు సామ్రాజ్యంను ఎన్‌సీసీ టీచర్‌గా నియమించారు. సుబేదార్ గురుదీప్, సురేంద్రసింగ్, సుహాన్‌కుమార్, నాగరాజు, కేఎస్ రెడ్డి, రాములు పాల్గొన్నారు.

ఈ - పంటను నమోదు చేయించుకోవాలి

● మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి

కొల్లిపర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ఈ-పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపర వ్యవసాయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నమోదు కార్యక్రమం ఈ నెలాఖరు వరకు మాత్రమే ఉందన్నారు. ఈ-పంట నమోదు చేయడం వలన రైతులకు ప్రభుత్వం అందించే మద్ధతు ధర, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందటానికి అవకాశం ఉందన్నారు. పంట వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు.

తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా హరిప్రసాదరావు

● ఏకగ్రీవంగా ఎన్నిక, ప్రమాణ స్వీకారం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా మంగమూరి హరిప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీబీ రోడ్డులోని బ్యాంకులో సోమవారం డైరెక్టర్లను సమావేశపరిచి చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి పదవులకు కె.వెంకటేశ్వరరావు ఎన్నిక నిర్వహించారు. చైర్మన్ పదవికి హరిప్రసాద్ పేరును షేక్ జిలాని ప్రతిపాదించగా దొప్పలపూడి శ్యామ్ బలపరిచారు. వైస్‌చైర్మన్ పదవికి అక్కిశెట్టి వెంకటేశ్వరరావు పేరును కన్నెగంటి శ్రీనివాసరావు ప్రతిపాదించగా తోట చంద్రశేఖర్ బలపరిచారు. కోశాధికారి పదవికి తోట పున్నారావు పేరును బచ్చు శ్రీనివాస్ ప్రతిపాదించగా కనగాల శ్రీనివాసరావు బలపరిచారు. మూడు పదవులకు పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి ఎన్నికల అధికారి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. వీరితో పాటు 9మంది డైరెక్టర్లు కూడా ప్రమాణం చేయించారు. ఎన్నికైన బ్యాంకు చైర్మన్ పాలకవర్గాన్ని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు. బ్యాంకును అన్నివిధాలా అభివృద్ధి చేసి సభ్యులకు, ప్రజలకు ఆర్థిక అవసరాలు తీరేలా తీర్చిదిద్దుతామని చైర్మన్ హరిప్రసాద్ పేర్కొన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంకు సేవలు అందిస్తామన్నారు.



చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి

అర్బన్ బ్యాంకు అధ్యక్షుడిగా మరోమారు ఎన్నికైన మంగమూరి హరిప్రసాదరావు బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తారని గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి చెప్పారు. బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను సోమవారం బ్యాంకు కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు. జనసేన నాయకులు గౌరిశంకర్, తోటకూర వెంకటరమణరావు, జకీరహుస్సేన్, టీడీపీ నాయకులు పెండేల వెంకట్రావు, మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, దేవినేని రమాదేవి, బీజేపీ నాయకుడు వాసుదేవనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.



అర్బన్ బ్యాంకు చైర్మన్ హరిప్రసాద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

వైసీపీకి పూర్వవైభవాన్ని తీసుకురావాలి

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి పూర్వ వైభవాన్ని తీసుకురావటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మున్నంగిలో ఆరిగ ఆశోక్‌రెడ్డి నివాసంలో పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పరిపాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. పేదప్రజలకు కూటమి ప్రభుత్వంలో పూర్తిగా అన్యాయం జరిగిందన్నారు. సమావేశంలో వైసీపీ మండల అధ్యక్షుడు కల్లం వెంకటప్పారెడ్డి, సర్పంచ్ రత్నబాబు, ఉపసర్పంచ్ ఆళ్ళ శివనాగిరెడ్డి, నాయకులు ఎ.కోటిరెడ్డి, టి.సుజాత పాల్గొన్నారు.

'పరస్పర సహకారంతో కేసుల పరిష్కారం'

తెనాలి క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో ఒకే రోజు 747 కేసులు పరిష్కరించడం జరిగిందని తెనాలి మండల న్యాయ సేవాధికారి 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. కేసుల విచారణలో తోడ్పాటునందించిన సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు సిబ్బందికి, సర్దుబాటు తత్వంతో రాజీ కుదుర్చుకున్న కక్షిదారులకు, కోర్టు సిబ్బందికి న్యాయమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా...

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు కరాటేతో పాటు కర్రసాము కూడా దోహదపడుతుందని, కర్రసాము శిక్షకుడు సాంబయ్య పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని హరిహన్సిక తైక్వాండో ఇనిస్టిట్యూట్ 37వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బాలికలకు ప్రాచీన యుద్ధ కళ కర్రసాములో శిక్షణ ప్రారంభించారు.

● పొన్నూరు టౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఆటో డ్రైవర్లకు రూ.30వేలు ఆర్థిక సాయాన్ని వాహన మిత్ర కింద అందించి ఆదుకోవాలని ఏఐటీయూసీ పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కే రత్నబాబు షేక్ బాబావలి, కాటూరి విజయ్ కుమార్, సుబ్బయ్య, బడేసా నీలం, రవి, ప్రభుదాస్, జి.కిషోర్ బాబు, షేక్ జానీ పాల్గొన్నారు.

● కొల్లిపర: మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం కోసం స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నీహ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు.

● కొల్లిపర: డ్వాక్రా మహిళలు స్వయం సహాయ సంఘాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మన డబ్బులకు ... మన లెక్కలు కార్యక్రమంలో భాగంగా అధికారులు, డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, సర్పంచ్ పిల్లి రాధిక, ఐబీడీపీఎం శివప్రసాదరెడ్డి, ఐబీపీఎం జీవన్, ఏపీఎం రమాదేవి, సీసీలు టి. మధు, వి.విజయకుమార్, ప్రమీల, బుజ్జిబాబు, ఎంఎస్‌పి గుడిబండి సీత తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని ధనుస్సు, పాదుకలకు ప్రత్యేక పూజలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులోని దాసకూటి ఆశ్రమంలో శ్రీరాముని ధనుస్సు పాదుకలకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముని వంశీయులు అయోధ్యలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. మండపం వద్ద 120 అడుగుల ఎత్తులో శ్రీరాముని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం తయారుచేసిన ధనుస్సు పాదుకలను ఆశ్రమంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు ధనుస్సు, పాదుకలను దర్శించుకుని, సీతారామ దాసస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపించారు.



అంగలకుదురు ఆశ్రమంలో పూజలందుకుంటున్న ధనస్సు, పాదుకలు

డివిజన్‌లో వర్షపాతం వివరాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెనాలి డివిజన్‌లో వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కాకుమాను 54 మి.మీ, దుగ్గిరాల 45.6 మి.మీ, మంగళగిరి 43 మి.మీ, కొల్లిపర 38.4 మి.మీ, తాడేపల్లి 17.6 మి.మీ, చేబ్రోలు 9.2 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలిపారు.

ఘనంగా శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాజరుపేటలోని శరణగతి గోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీవైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీనరేంద్ర రామానుజ దాసస్వామి ప్రత్యేక పూజలు, మంగళాశాసనం, ప్రసాద వినియోగం, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవైష్ణవ కృష్ణాష్టమి ప్రాధాన్యంను భక్తులకు వివరించారు. భక్తిగీతాలు, కోలాటం, కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. వేడుకల్లో ముద్దాభక్తుని రమణయ్య, రామారావు, సీతారామయ్య, కోటేశ్వరరావు, రామానుజాచార్యులు పాల్గొన్నారు.



వైష్ణవ కృష్ణాష్టమి పూజలు చేస్తున్న అర్చకులు

రాష్ట్ర వ్యాప్త నిరసనలకు సచివాలయ సిబ్బంది సన్నాహాలు

చేబ్రోలు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమవారం చేబ్రోలు సచివాలయ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాల ముందస్తు సమాచారంను అధికారులకు రాతపూర్వకంగా యూనియన్ రిప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రవ్యాప్త నిర్ణయం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వున్న సమస్యల పరిష్కారం కోరుతూ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల తహసీల్దార్‌లకు వినతి పత్రం సమర్పించారు. 15రోజులలోగా పరిష్కారం లభించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలి

● ఉద్యానవన శాఖాధికారి శ్రీనిత్య

కొల్లిపర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని సాధ్యమైనంతవరకు బయటకు పంపించాలని ఉద్యానవన శాఖాధికారి శ్రీనిత్య అన్నారు. సోమవారం మండల కేంద్రం కొల్లిపరలో వర్షానికి నీటమునిగిన పసుపు, అరటి, కంద పంటలను ఆమె పరిశీలించారు. నీట మునిగిన పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనిత్య మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్లనే పంటలు మునిగిపోవడం జరిగిందన్నారు. పంట పొలాల్లో ఎక్కువ రోజులు వర్షపు నీరు నిల్వఉంటే పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతులు ఉయ్యూరు సాంబిరెడ్డి, గుదిబండి వెంకటరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుదిబండి బుల్లిగురవారెడ్డి, ఉద్యానవన సహాయకురాలు నాగమణి పాల్గొన్నారు.